షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక




సంపుటి : 1 సంచిక : 238 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 10 జూలై 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 238 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 10 july 2024 PAGES : 8 PRICE : 5/-

## నీట్ యూజీ పేపర్ లీక్ కేసులో మరో ఇద్దరి అరెస్ట్

- అరెస్టయిన ఇద్దరు నిందితుల్లో ఒకరు నీట్ అభ్యర్థి కాగా, మరొకరు మరో నీట్ అభ్యర్థి తండ్రి
- నీట్ పేపర్ లీకేజీ అంశం ప్రస్తుతం దేశవ్యాప్తంగా దుమారం
- పరీక్ష నిర్వహణలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నందున రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని 38 మంది అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్




## మనీలాండరింగ్ కేసులో సత్యేంద్ర జైన్‌కు బెయిల్ నిరాకరణ

- వైద్య కారణాల రీత్యా తనకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేయాలని సత్యేంద్ర జైన్ కోరినప్పటికీ తోసిపుచ్చిన కోర్టు
- అవినీతి నిరోధక చట్టం కింద 2017లో సత్యేంద్ర జైన్‌పై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు



# ఎక్కడా విద్యుత్ కోతలు ఉండొద్దు

**అసమర్థులు పాలన చేస్తే ఇంతే... విద్యుత్ రంగం దారుణంగా దెబ్బతింది**



- విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు
- ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో భయంకరమైన పరిస్థితులు ఉన్నాయని వెల్లడి
- శ్వేతపత్రాల ద్వారా ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్నామని స్పష్టీకరణ
- సమర్థమైన పాలన వల్లే పేదలకు మెరుగైన ప్రయోజనాలు అందుతాయి
- బాధ్యతలేని పరిపాలన వల్ల అనేక కష్టాలు ఎదురవుతాయి
- "విద్యుత్ తో ప్రతి ఒక్కరి జీవితం ముడిపడి ఉంది
- విద్యుత్ రంగంపైనే ప్రజల జీవన ప్రమాణాలు ఆధారపడి ఉన్నాయి.

**అమరావతి**

నూతన ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో వేర్వేరు అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తున్న కూటమి ప్రభుత్వం.. తాజాగా విద్యుత్ అంశంపై శ్వేతపత్రం విడుదల చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇవాళ (మంగళవారం) విద్యుత్‌పై శ్వేతపత్రం విడుదల చేశారు. విద్యుత్ సంస్థలకు రూ.1 లక్షా 29 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్ర విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు గెలవాలి, రాష్ట్రం నిలబడాలి అని పిలుపునిచ్చామని... ప్రజలు గెలిచి కూటమిని గొప్ప స్థానంలో నిలబెట్టారని కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో భయంకరమైన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. శ్వేతపత్రాల ద్వారా ఆయా శాఖల గురించి ప్రజలందరికీ వాస్తవాలు చెప్పాలన్నదే తమ ప్రయత్నమని చంద్రబాబు స్పష్టం చేశారు. సమర్థమైన పాలన వల్లే పేదలకు మెరుగైన ప్రయోజనాలు అందుతాయని, బాధ్యతలేని పరిపాలన వల్ల అనేక కష్టాలు ఎదురవుతాయని వివరించారు. గత ప్రభుత్వం ఎంత నష్టం చేసిందో ప్రజలకు చెబుతున్నామని అన్నారు. అహంకారం ఉన్న వ్యక్తి అధికారంలో ఉంటే ఏమవుతుందనేది - మిగతా3లో



# ఆ ఘనత చంద్రబాబుదే..

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
- చంద్రబాబు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారు
- ఎన్డీఏ ప్రభుత్వం ప్రజాపక్షపాతితో పనిచేస్తుంది
- రాబోయే ఐదేళ్లలో ప్రజల్లో మంచి ప్రభుత్వం అనిపించు కునేలా వ్యవహరిస్తాం
- జగన్ ప్రభుత్వం లాగా దాడులు చేసే సంస్కృతీ తమకు లేదు

**కడప**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రజాపక్షపాతితో పనిచేస్తుందన్నారు. రాబోయే ఐదేళ్లలో ప్రజల్లో మంచి ప్రభుత్వం అనిపించు కునేలా వ్యవహరిస్తామని అన్నారు. జగన్ ప్రభుత్వం లాగా దాడులు చేసే - మిగతా3లో

# ఏపీలో కాంగ్రెస్.. వైఎస్సార్ అస్త్రం



- అటు ఏపీలో మాజీ సీఎం వైఎస్ జగన్ తన తండ్రి సమాధి వద్ద నివాళులు
- అలాగే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూడా తల్లి విజయమ్మతో కలిసి నివాళి అర్పించారు.
- మంగళగిరిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి తెలంగాణ నుంచి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆహ్వానం
- ఊతం ఇచ్చేలా కాంగ్రెస్ అగ్రనేత ఎంపీ రాహుల్ గాంధీ తన ఎక్స్ ఖాతాలో సంచలన ట్వీట్

**గుంటూరు**

వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా తెలుగురాష్ట్రాల్లో కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు ఘనంగా నిర్వహించారు. అటు ఏపీలో మాజీ సీఎం వైఎస్ జగన్ తన తండ్రి సమాధి వద్ద నివాళులు అర్పించారు. - మిగతా3లో

# 2026 నాటికి భోగాపురం ఎయిర్ పోర్టు పూర్తి చేస్తాం

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
- రేపు భోగాపురం ఎయిర్ పోర్టును సందర్శించనున్న సీఎం చంద్రబాబు
- సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన కింజరాపు రామ్మోహన్ నాయుడు
- భోగాపురంపై చంద్రబాబు, పవన్ ప్రత్యేకంగా దృష్టి సారించారని వెల్లడి



# రూ. 5.40 లక్షల కోట్లతో రుణ ప్రణాళిక



- రూ.3,75 లక్షల కోట్లు ప్రాధాన్య రంగాలకు కేటాయింపు
- గతంతో పోల్చితే 16 శాతం అధికంగా రుణాల లక్ష్యం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన స్టేట్ లెవల్ బ్యాంకర్ల కమిటీ సమావేశంలో నిర్ణయం
- అమరావతిలో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన... పలు అంశాలపై చర్చించిన ఎస్ఎల్ బీసీ
- పలు అంశాలపై సబ్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం

**అమరావతి**

2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.5,40,000 కోట్లతో రుణ ప్రణాళిక విడుదల చేశారు. మంగళవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల (ఎస్ఎల్‌బీసీ) సమావేశం నిర్వహించారు. రుణ ప్రణాళిలో రూ.3,75,000 - మిగతా3లో



# ప్రతీకారం తీర్చుకుంటాం..

- కథువా ఉగ్రదాడి ఘటనపై తీవ్రంగా స్పందించిన భారత్
- దాడి వెనుక ఉన్న దుష్ట శక్తులను భారత్ మట్టుబెడుతుంది'
- ఉగ్రదాడిలో అమరులైన సైనిక కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి
- సైనికుల నిస్వార్థ సేవలను దేశం ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుంది

# ఎక్కడా విద్యుత్ కోతలు ఉండొద్దు

-మొదటిపేజీ తరువాయి

ఈ లెక్కలను చూస్తే అర్థమవుతోందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. రాగద్వేషాలకు అతీతంగా ప్రజలు ఆలోచించాలని అన్నారు. 2004లో తన పవర్ పోయింది కానీ పవర్ సెక్టార్‌లో తీసుకువచ్చిన సంస్కరణలు శాశ్వతంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సంస్కరణల కారణంగా విద్యుత్ రంగం రాష్ట్రంలో, దేశంలో నిలబడిందని అన్నారు.

"విద్యుత్ తో ప్రతి ఒక్కరి జీవితం ముడిపడి ఉంది. విద్యుత్ రంగంపైనే ప్రజల జీవన ప్రమాణాలు ఆధారపడి ఉన్నాయి. 2014లో తాము అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉంది. ఈ ఐదేళ్లలో విద్యుత్ రంగాన్ని పూర్తిగా నాశనం చేశారు. అసమర్థులు పాలన చేస్తే ఇలాగే ఉంటుంది. 1998లో మేం తొలిసారిగా విద్యుత్ సంస్కరణలు అమలు చేశాం. దేశంలోనే మొట్టమొదటి రెగ్యులేటరీ కమిషన్ ఏపీలోనే వచ్చింది. విద్యుత్ సంస్కరణల వల్ల 2004లో నా అధికారం పోయినా దేశం బాగుపడింది. మేం తీసుకువచ్చిన విద్యుత్ సంస్కరణలు దేశవ్యాప్తంగా గణనీయమైన మార్పును తీసుకువచ్చాయి. ఏపీలో 2014 డిసెంబరు నాటికి 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరత ఉంది. అక్కడ్నించి సమర్థవంతమైన పవర్ మేనేజ్ మెంట్ తో 2018 జనవరి నాటికి మిగులు విద్యుత్ సాధించాం. పీక్ డిమాండ్ ను 6,784 మెగావాట్ల నుంచి 9,453 మెగావాట్లకు పెంచాం. వినియోగాన్ని 40,174 మిలియన్ యూనిట్ల నుంచి 54,555 మిలియన్ యూనిట్లకు పెంచాం. అది కూడా ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండానే, ఎలాంటి టారిఫ్ లు పెంచకుండానే, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తూనే ఇదంతా సాధించాం.

2004 సమయంలో రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి రాగా... అంతకుముందు నేను విద్యుత్ రంగ సంస్కరణలతో రాబట్టిన ప్రయోజనాలు ఆయన ప్రభుత్వానికి దక్కాయి. మా హయాంలో రెండు థర్మల్ విద్యుత్ కేంద్రాలు తీసుకువచ్చాం. ఒకటి వీటీపీఎస్, రెండు కృష్ణపట్నం.

ఎనర్జీ ఎఫిషియన్సీలో వరల్డ్ బ్యాంక్ కూడా నెంబర్ వన్ ర్యాంక్ ఇచ్చింది. మా హయాంలో విద్యుత్ రంగానికి మొత్తం 145 అవార్డులు వచ్చాయి. ట్రాన్స్ కో, జెన్ కో సంస్థలకు అనేక అవార్డులు లభించాయి. 2014 నుంచి 2019 వరకు సోలార్ ఎనర్జీ, పవన విద్యుత్ ఉత్పాదనను పెంచాం.

ఇక, వైసీపీ ప్రభుత్వం వచ్చాక చూస్తే... 2019 నుంచి 2024 వరకు ప్రజలపై విపరీతమైన భారం పడింది. వినియోగదారులపై రూ.32,166 కోట్ల భారం మోపారు. ఏపీ విద్యుత్ సంస్థల రుణాలు రూ.49,596 కోట్లకు పెరిగాయి. అసమర్థ పాలన కారణంగా రాష్ట్ర విద్యుత్ రంగానికి రూ.47,741 కోట్ల మేర నష్టాలు వాటిల్లాయి.

గత వైసీపీ ప్రభుత్వం సోలార్ విద్యుత్ ను వాడుకోకుండా, తిరస్కరించింది. దాంతో కోర్టు... అవన్నీ కుదరవు... మీరు చెల్లింపులు చేయాల్సిందేనని స్పష్టం చేయడంతో... వాడుకోని కరెంటుకు రూ.9 వేల కోట్లు చెల్లించారు. 21 విండ్ మిల్ పీపీఏలు రద్దు చేశారు. విండ్ మిల్స్ కరెంటుకు కూడా చెల్లించాల్సిందేనని కోర్టు చెప్పింది.

మొత్తమ్మీద విద్యుత్ రంగంలో తమ అసమర్థ విధానాలతో ప్రజల నడ్డి విరిచారు. ట్రూఅప్ చార్జీల పేరుతో అదనపు భారం మోపారు. గృహ వినియోగదారులపై 45 శాతం చార్జీలు పెంచారు. వైసీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడం వల్ల 1.53 కోట్ల మంది ప్రజలు ఇబ్బందిపడ్డారు. 50 యూనిట్లు వాడిన పేదల చార్జీలు 100 శాతం పెంచారు. ఇవన్నీ మామూలు సమస్యలు కాదు. రాష్ట్ర విద్యుత్ రంగంలో ఎవరైనా పెట్టుబడులు పెట్టాలంటే వెనుకంజ వేసే పరిస్థితి నెలకొంది. ఇప్పుడవన్నీ పరిష్కరించాలంటే చేయాల్సింది చాలా ఉంది. చాలా పెద్ద కసరత్తు చేయాల్సి ఉంది.

నేను నాలుగోసారి ముఖ్యమంత్రిని అయ్యాను. కానీ, ఇంత భారీ స్థాయిలో విద్యుత్ రంగ వ్యవస్థలు దెబ్బతిన్న సందర్భం ఎప్పుడూ చూడలేదు. 2014లో 22.5 మిలియన్ల యూనిట్ల కరెంటు కొరత ఉంటే దాన్ని 3 నెలల్లో అధిగమించాను. అక్కడ్నించి సంస్కరణలు తీసుకువచ్చి, మిగులు విద్యుత్ సాధించాం. 1994-95లో దేశమంతా విద్యుత్ రంగం సంక్షోభంలో ఉంది. ఆ తర్వాత మేం విద్యుత్ సంస్కరణలు తీసుకువచ్చాం. 2004 నాటికి మిగులు విద్యుత్ సాధించాం. ఈరోజు పరిస్థితి ఏంటంటే... అప్పులు కట్టాలి, దెబ్బతిన్న వ్యవస్థను గాడిలో పెట్టాలి, ప్రజలకు హామీ ఇచ్చిన మేరకు భారం లేకుండా చేయాల్సిన బాధ్యత మా మీద ఉంది. ఒకపక్కన చూస్తే మోయలేనంత భారం... మరోపక్కన చూస్తే మాపై ప్రజల్లో ఎక్కడ లేనంత అభిమానం! ఈ రెండింటిని బ్యాలన్స్ చేసుకుంటూ, ప్రజలందరి నుంచి సూచనలు అందుకుని ముందుకు వెళతాం. భవిష్యత్ లో విద్యుత్ ఆధారిత వాహనాలు పెరుగుతాయి... ఆ మేరకు విద్యుత్ ఉత్పాదన కూడా పెంచుకోవాల్సిన అవసరం ఉంది" అని చంద్రబాబు వివరించారు.

**అసమర్థుడు కారణంగా రూ.47,741 కోట్లు**

**నష్టపోయాం: చంద్రబాబు**

2019-2024 మధ్యకాలంలో జరిగిన నష్టం అంతా ఇంతా కాదని అన్నారు. అసమర్థ నిర్ణయాల కారణంగా ప్రజలపై భారం పడిందని, సోలార్ విద్యుత్ వాడుకోకుండా రూ.9 వేల కోట్లు చెల్లించారని వెల్లడించారు. గత 5 సంవత్సరాల్లో మొత్తం రూ.32,166 కోట్లు ప్రజలపై అదనపు భారం పడిందని సీఎం చంద్రబాబు అన్నారు. గృహ వినియోగదారులపై రూ.8,180 కోట్ల భారం పడిందని చెప్పారు. "పెత్తందారులు, పేదవారికి పోటీ అని చెప్పేవాడు. ఈ పెత్తందారీ పాలనలో పేదవాడు ఎలా నలిగిపోయాడో అందరికీ తెలిసింది. చేతకాని పరిపాలన కారణంగా మొత్తం విద్యుత్ సంస్థలు దెబ్బతిన్నాయి. అసమర్థుడు కారణంగా మొత్తం రూ.47,741 కోట్లు నష్టపోయాం. తిక్కలోడు తిరణాల వెళితే ఎక్కను, దిగను సరిపోయిందట. జగన్ పాలన కూడా అలానే ఉంది. పోలవరం పవర్ ప్రాజెక్టు జాప్యం కారణంగా రూ.4,700 కోట్లు నష్టం వచ్చింది. అహంకారం ఉంటే ఇలానే జరుగుతుంది. రాష్ట్రం ఎలా నష్టపోతుంది అనేది తెలిసిపోతుంది" అని చంద్రబాబు అన్నారు.

**పీఎఫ్ ఫండ్ డబ్బులు కొట్టేసేందుకు ప్రయత్నించారు: చంద్రబాబు**

ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల పీఎఫ్ ఫండ్ డబ్బులు కూడా కొట్టేసే ప్రయత్నం చేశారని, ఎక్కడ డబ్బు దొరికితే అక్కడ కొట్టేశారని సీఎం చంద్రబాబు అన్నారు. పవర్ సెక్టార్‌లో గ్రోత్ లేకపోవడంతో పారిశ్రామిక అభివృద్ధి ఆగిపోయిందని చంద్రబాబు వెల్లడించారు. "పెట్టుబడిదారులు విశ్వాసం కోల్పోయారు. ఈ పరిస్థితి నుంచి బయట పడాలంటే ఏం చేయాలనే అంశంపై ఆలోచిస్తున్నాం. ఇది చాలా పెద్ద కసరత్తు. నా రాజకీయ జీవితంలో ఇటువంటి పరిస్థితి ఎప్పుడు చూడలేదు. నేను నాలుగవసారి ముఖ్యమంత్రిని ఇటువంటి పరిస్థితి నేను ఎప్పుడూ ఎదుర్కొనలేదు" అని చంద్రబాబు అన్నారు.

**ఎక్కడా విద్యుత్ కోతలు ఉండొద్దు**

విద్యుత్ కోతలు ఎక్కడా ఉండడానికి వీలులేదని సీఎం చంద్రబాబు అన్నారు. లో ఓల్టేజ్ ఉండకూడదని, నాణ్యమైన కరెంట్ ఇవ్వాలని అధికారులకు సూచనలు చేశారు. ఎక్కడ పవర్ కట్ ఉండేందుకు వీలులేదని, ఇప్పుడే అధికారులను ఆదేశిస్తున్నానని అన్నారు. ఎక్కడి నుంచి ఫిర్యాదు వచ్చినా వూరుకోబోనని చంద్రబాబు ఈ సందర్భంగా వార్నింగ్ ఇచ్చారు.

# రూ. 5.40 లక్షల కోట్లతో రుణ ప్రణాళిక

-మొదటిపేజీ తరువాయి

కోట్లు ప్రాధాన్య రంగాలకు, రూ.1,65,000 కోట్లు ఇతర రంగాలకు కేటాయించారు. వ్యవసాయ రంగానికి రూ.2,64,000 కోట్లు రుణాలు లక్ష్యం. అంటే గతం కంటే 14 శాతం అధికంగా రుణాలు. డైరీ, ఫౌల్ట్రీ, ఫిషరీస్, వ్యవసాయ యాంత్రీకరణకు, వ్యవసాయం రంగంలో మౌళిక సదుపాయాలకు రూ.32,600 కోట్లతో రుణ ప్రాణాళిక. 2023%-%24 ఆర్థిక సంవత్సరానికి ప్రాధాన్యతా రంగానికి రూ.323000 కోట్లు పెట్టుకోగా...ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.3,75,000 కోట్లు రుణ ప్రణాళికా లక్ష్యం. గతంతో పోల్చితే 16 శాతం అధికంగా రుణాల లక్ష్యం. వ్యవసాయ రంగానికి గత సంవత్సరం రూ.231000 కోట్లు రుణ లక్ష్యం గాపెట్టుకోగా అందులో 90 శాతం అనగా రూ.208136 కోట్ల రుణాలు మంజూరు. ఉద్యోగ, ఉపాధి కల్పనకు దోహద పడే %వీ వీ%ఉ రంగానికి 2023%-%24 ఏడాదిలో రూ.69,000 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా, ఈ ఏడాది ఏకంగా రూ.87,000 కోట్లు లక్ష్యం. అంటే 26 శాతం అధికంగా రుణాలు ఇవ్వాలని ప్రణాళిక. అలాగే గహ నిర్మాణానికి రూ.11500 కోట్లు రుణాలు ఇచ్చేందుకు ప్రణాళిక. సాంప్రదాయేతర ఇంధన సెక్టార్ కు రూ. 8000 కోట్లు రుణ ప్రాణాళిక సిద్ధం.



**బ్యాంకర్లతో సబ్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం..**

1.వ్యవసాయంలో సాగు ఖర్చులు తగ్గించడం, కౌలు రైతులకు సులభంగా రుణాలు అందించడం, మెరుగైన పంటల బీమాను అందుబాటులోకి తేవడం, 2. పి 4 విధానం ద్వారా పేదరిక నిర్మూలనకు అవసరమైన ప్రాజెక్టులు, ప్రణాళిక చేపట్టడం, 3.డిజిటల్ లావాదేవీల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడం, 4. స్కిల్ డవల్మెంట్ కు చర్యలు తీసుకోవడం, 5.సంపద సష్టించే, జీఎస్ డిపి పెంచే రంగాలకు తగు ప్రోత్సాహం ఇవ్వడంపై మంత్రులు, బ్యాంకర్లు, ఆయా రంగాల నిపుణులతో కమిటీ ఏర్పాటు. సమావేశంలో పాల్గొన్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు, యూనియన్ బ్యాంక్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ రుద్ర, ఎస్.ఎల్.బీసీ కన్వీనర్ సీవీఎన్ భాస్కర్ రావు, ఇతర బ్యాంకు అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కలిసి రాని కాలంమార్గని భరత్

**రాజమండ్రి :** ఒకప్పుడు ఆయన ఏపీ మాజీ సీఎం జగన్ కు కుడిభుజం. చిన్న వయసులోనే రాజకీయాలలోకి వచ్చి వైఎస్ఆర్ సీపీ తరపున ఎంపీగా గెలిచి పార్లమెంట్ లో అడుగుపెట్టారు. రాజకీయ అరంగేట్రమే భారీ మెజారిటీతో గెలిచి రికార్డు సృష్టించడం విశేషం. అయితే ఈ సారి అదే పార్టీనుంచి రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. ఆయనే మార్గాని భరత్ రామ్. పలు సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ జనంలో మంచి పేరే సంపాదించుకున్నారు. అంతేకాదు అప్పట్లో వైఎస్ జగన్ పాదయాత్రకు తన సంపూర్ణ మద్దతు ప్రకటించి జగన్ కు అండగా నిలిచారు.భరత్ పై నమ్మకంతో జగన్ ఆయనను వైఎస్ఆర్ సీపీ పార్లమెంటరీ ప్రతినిధిగా నియమించారు. కరోనా సమయంలోనూ భరత్ ప్రజల మధ్యే ఉంటూ పలు సేవలు అందించి ప్రశంసలు పొందారు. అయితే రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్, చంద్రబాబు ఇటీవల హైదరాబాద్ లో భేటీ అయిన విషయం విదితమే. వారి భేటీపై భరత్ విమర్శలు గుప్పించారు. పలు సందేహాలు కూడా వ్యక్తం చేశారు. అసలు విభజన సమస్యలు గాలికి వదిలేసి పనికిరాని అంశాలపై చర్చించారని మండిపడ్డారు. పైగా పరిష్కరించవలసిన తక్షణ సమస్యలపై చర్చించకుండా వదిలేశారని అన్నారు.కేంద్రం నుంచి ఏ ఒక్క ప్రతినిధి లేకుండా కేవలం వీరిరువురే చర్చించడం శోచనీయం అన్నారు. కేంద్రం తరపున ఎవరినైనా మధ్యవర్తిగా పిలిపించుకుంటే బాగుండేదని అన్నారు. అవన్నీ బాగానే ఉంది గానీ హఠాత్తుగా జనసేనాని పవన్ కళ్యాణ్ పై మార్గాని భరత్ తెగ అభిమానాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ భేటీకి పవన్ కళ్యాణ్



ను ఆహ్వానించకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జనసేనాని కృషితోనే ఏపీలో కూటమి చెలిమికి బీజం పడిందని..నాడు పవన్ పూనుకోకపోతే టీడీపీకి , బీజేపీకి మెజారిటీ స్థానాలు వచ్చేవా అంటూ పవన్ కళ్యాణ్ ను ఏకంగా ఆకాశంలోకి ఎత్తేస్తున్నారు.జగన్ అధికారంలో ఉన్నప్పుడు పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితంపై విమర్శలు చేశారు. జగన్ కు పవన్ కు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ద్వేషించుకున్నారు. అలాంటిది ఇప్పుడు భరత్ జనసేనానిపై కురిపిస్తున్న ప్రేమ వెనుక రాజకీయ కోణం ఏదైనా ఉందా అని అందరూ అనుకుంటున్నారు. పైగా త్వరలో భరత్ జనసేన కండువా మార్చుకోనున్నారని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఎందుకంటే భరత్ తండ్రి ఒకప్పుడు ప్రజారాజ్యం పార్టీలో ఉండేవారు. చిరంజీవి కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఇప్పుడు పవన్ కళ్యాణ్ ను ప్రసన్నం చేసుకుని జనసేన పార్టీలో చేరి మళ్లీ జనానికి చేరువవుదామని భావిస్తున్నారు భరత్ అని రాజకీయ విమర్శకులు, నెటిజన్లు ట్రోలింగ్ చేస్తున్నారు.

## 2026 నాటికి భోగాపురం ఎయిర్ పోర్టు పూర్తి చేస్తాం



కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నేడు విజయనగరం జిల్లాలోని భోగాపురం ఎయిర్ పోర్టు ప్రాంతాన్ని పరిశీలించారు. ఎల్లుండి సీఎం చంద్రబాబు భోగాపురం విమానాశ్రయ పనుల పరిశీలనకు వస్తున్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను కూడా రామ్మోహన్ నాయుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఉత్తరాంధ్ర ప్రాంతానికి భోగాపురం ఎయిర్ పోర్టు గుండెకాయ వంటిదని అభివర్ణించారు. నిర్ణీత సమయంలోనే భోగాపురం విమానాశ్రయం పూర్తి చేస్తామని చెప్పారు. 2026 నాటికి భోగాపురం ఎయిర్ పోర్టు పనులు పూర్తవుతాయని వివరించారు. భోగాపురం ఎయిర్ పోర్టుపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారని రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానాశ్రయ పనులపై సీఎం చంద్రబాబు సూచనలు కూడా తీసుకుంటామని అన్నారు. కేంద్రం నుంచి ఎలాంటి అనుమతులు కావాలన్నా వెంటనే వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం విమానాశ్రయ పనులను ఆలస్యం చేసిందని ఆరోపించారు. డిసెంబరు నాటికి టెర్మినల్ భవనం పూర్తి చేస్తామని చెప్పారు. చిన్న చిన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని తెలిపారు. విమానాశ్రయం పూర్తయితే దాదాపు 6 లక్షల మందికి ఉపాధి కలుగుతుందని అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల వారే కాకుండా ఒడిశా వాసులకు కూడా భోగాపురం ఎయిర్ పోర్టు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. దీన్ని సరిగ్గా సద్వినియోగం చేసుకోగలిగితే, భవిష్యత్తులో ఉత్తరాంధ్రకు ఎన్నో కంపెనీలు వస్తాయని తెలిపారు. గత ప్రభుత్వం ప్రాజెక్టులు పూర్తి చేయలేక, గడువులు పెంచుకుంటూ పోయిందని, కానీ తాము అధికారంలోకి వచ్చాక మొట్టమొదటి నెలలోనే ప్రాజెక్టును సందర్శించి, గడువు తేదీ చెబుతున్నామని, ఈ విషయాన్ని తాము ఓ బాధ్యతగా తీసుకుంటున్నామని రామ్మోహన్ నాయుడు వివరించారు. కేంద్రమంత్రిగా ఈ ఎయిర్ పోర్టుపై తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని చెప్పారు.

## ఆ ఘనత చంద్రబాబుదే..



-మొదటిపేజీ తరువాయి

సంస్కృతీ తమకు లేదని చెప్పారు. ఉమ్మడి కడప జిల్లాలో సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈరోజు(మంగళవారం) కడపలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఉమ్మడి జిల్లాల్లో యంగ్ అండ్ డైనమిక్ కలెక్టర్లను నియమించడం జరిగిందని చెప్పారు. ఒకటో తేదీనే రూ.65 లక్షల పెన్షన్లు ఇచ్చిన ఘనత చంద్రబాబుదేనని ఉద్ఘాటించారు. వైసీపీ నిరుద్యోగుల పొట్ట కొట్టిందని ధ్వజమెత్తారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక మొట్టమొదటిగా డీఎస్సీ విడుదల చేసి నోటిఫికేషన్ ఇచ్చామని వివరించారు. స్మగ్లర్లను యాంటీ సోషల్ ఎలిమెంట్స్‌ను ప్రోత్సాహంచే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రాజెక్టలను త్వరగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మేలు జరిగే ఏ పథకాన్ని ఆపే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. గత ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందని, ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి పోలవరం పనులను పరిశీలించారని గుర్తుచేశారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా పని చేస్తామని.. రైతు భరోసా కేంద్రాలు చివరి క్షణాల్లో నిర్మించారని అన్నారు. లోటు బడ్జెట్‌లో ప్రభుత్వం ఏర్పడినా ఒకటో తేదీన పెన్షన్లు పంపిణీ చేశామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

## ఏపీలో కాంగ్రెస్.. వైఎస్సార్ అస్త్రం

-మొదటిపేజీ తరువాయి

అలాగే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూడా తల్లి విజయమ్మతో కలిసి నివాళి అర్పించారు. ఆమెతో పాటు కాంగ్రెస్ సీనియర్ లీడర్లు కూడా పాల్గొన్నారు. ఇక తెలంగాణలోనూ వైఎస్ఆర్ 75వ జయంతి సంబరాలు ఘనంగా, అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణలో నిర్వహించడమే కాకుండా మంగళగిరిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి తెలంగాణ నుంచి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆహ్వానం అందడంతో వారు హాజరయ్యారు. అలాగే కర్ణాటక నుంచి ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఎలాగైనా ఏపీలో కాంగ్రెస్ పార్టీకు పూర్వవైభవం తీసుకువచ్చి సౌత్ ఇండియాలో అటు ఏపీ, తెలంగాణ, కర్ణాటకల్లో పాగా వేయాలని ప్రయత్నాలు చేస్తోంది కాంగ్రెస్ అధిష్టానం.దీనిని ఊతం ఇచ్చేలా కాంగ్రెస్ అగ్రనేత ఎంపీ రాహుల్ గాంధీ తన ఎక్స్ ఖాతాలో సంచలన ట్వీట్ చేశారు. తనకు వైఎస్ఆర్ స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను వైఎస్ షర్మిల నెరవేర్చగలరని ధీమాను వ్యక్తం చేశారు. అదే క్రమంలో సోనియా గాంధీ కూడా వైఎస్ రాజశేఖర్ రెడ్డిని తలుచుకున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. అలాంటి పటిష్టమైన నాయకత్వ లక్షణాలు కలిగిన కుటుంబం నుంచి వచ్చిన వైఎస్ షర్మిల అయితేనే ఏపీలో రాణించగలరని ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఈ కీలక భేటీకి వేదికైంది ఏపీ రాజధాని అమరావతి ప్రాంతంలోని మంగళగిరి. ఇప్పటికే దేశంలో ఎన్డీయే సర్కార్ కొలువు దీరినప్పటికీ ఇండియా కూటమి కూడా ధీటైన సీట్లతో గట్టిపోటీ ఇచ్చింది. మొన్న జరిగిన సాధారణ ఎన్నికల్లో బీజేపీకి గట్టిపోటీ ఇచ్చింది కాంగ్రెస్. దేశంలో ప్రతిపక్షపాత్రను పోషిస్తోంది.ఇక ఏపీ విషయానికి వస్తే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చింది. ఎన్నడూ లేని విధంగా ఎవరూ కనీవిని ఎరుగని రీతిలో బంపర్ మెజార్టీ సాధించింది. అటు మొన్నటి వరకూ అధికారంలో ఉన్న వైఎస్ఆర్సీపీకి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసింది. దీంతో అసెంబ్లీలో ప్రజల తరఫున బలమైన స్వరం వినిపించేందుకు అవకాశం కూడా లేదని భావిస్తున్నారు ఆ పార్టీ నేతలు. ఇలాంటి తరుణంలో ఏపీలో కాంగ్రెస్ ప్రత్యమ్నాయం అని చెప్పుకునేందుకు సరైన అవకాశం వచ్చిందని భావిస్తున్నారు ఆ పార్టీ నేతలు. అందులో భాగంగానే ఈ కీలక భేటీ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ప్రజల్లో ఉంటూ, బలమైన క్యాడర్ ను తయారు చేసుకుంటూ 2029 ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతోంది కాంగ్రెస్. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అగ్రనేతలందరూ వైఎస్ షర్మిలకు మద్దతుగా ఉన్నారని తెలపడం కోసమే ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చర్చించుకుంటున్నారు రాజకీయ విశ్లేషకులు.ఎలాగైనా వచ్చే ఐదేళ్లలోపూ పార్టీని, క్యాడర్ ను పుంజుకునేలా చేసి ధీటైన నేతలను ఎంపిక చేసుకుని భవిష్యత్తు కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై కేవీపీ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో కీలక నేతలు చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక కాంగ్రెస్ ప్రత్యమ్నాయంగా మారితే వైఎస్ఆర్ ఓటు బ్యాంకు వైసీపీ నుంచి కాంగ్రెస్ లోని షర్మిల వైపుకు తిరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నట్లు సమాచారం. దానికి అనుగుణంగానే పార్టీ వ్యూహాలు రచిస్తోంది. ప్రస్తుతం ఉన్న కూటమి ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ముందుకు సాగితే ఎలాంటి ఇబ్బందికర పరిస్థితి తలెత్తదు. అది ఏ మాత్రం అసంతృప్తి ప్రజల్లో కనబరిచినా.. కాంగ్రెస్ పుంజుకునే అవకాశం ఉంది. అప్పుడు ప్రత్యమ్నాయంగా కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ రెండు పార్టీలు బలంగా మారే అవకాశం కనిపిస్తోందని చెబుతున్నారు రాజకీయ పరిశీలకులు. ఏపీలో జరిగే ఈ కీలక సమావేశం ఎలాంటి రాజకీయ పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాలి.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

## మార్కాపురం జిల్లా ఏర్పాటుతోనే..

# పశ్చిమ ప్రాంత అభివృద్ధి

### చంద్రబాబుపై ఆశతో ఎదురు చూస్తున్న ప్రజలు



(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జులై 9)

మార్కాపురం జిల్లా ఏర్పాటుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఎన్నికల సమయంలో టీడీపీ అధికారంలోకి వస్తే మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, దర్శి, కనిగిరి ప్రాంతాలను కలుపుతూ జిల్లా ఏర్పాటు చేయడంతో పాటు కం దుకూరు, అద్దంకి ప్రాంతాలను ఒంగోలులో కలుపుతామని నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ప్రజలకు హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి రాడవంతో పశ్చిమ ప్రాంత ప్రజలు మార్కాపురం జిల్లా ఏర్పాటుపై ఆశతో ఎదురు చూస్తున్నారు. ఏ నలుగురు కలిసినా మార్కాపురం జిల్లా ఏర్పాటుపై చర్చించుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా ఏర్పాటుపై ప్రకటన చేస్తారని రోజూ ఎదురుచూస్తు న్నారు. త్వరలో జరగబోయే క్యాబికెట్లో మార్కాపురం జిల్లా ఏర్పాటుపై తీర్మానం జరుగుతుందా లేదా ? అన్న అంశంపై కూడా ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇచ్చిన హామీ మేరకు జిల్లా ఏర్పాటుపై గెలిచిన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి వద్ద ప్రస్తావిస్తేనే జిల్లా ఏర్పాటు అంశం తెరపైకి వస్తుంది.

**అన్నీ అర్హతలు ఉన్నా**




పశ్చిమ ప్రకాశం ముఖ్యకేంద్రమైన మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేసేందుకు అన్నీ అర్హతలు ఉన్నాయి. మార్కాపురంలోనే సబ్‌కలెక్టర్, డీఎస్పీతో పాటు గతంలో అదనపు ఎస్పీ స్థాయి అధికారిని ఓఎస్డీగా నియమించారు. మార్కాపురంలో జిల్లా ఆరో అదనపు కోర్టు, ఆకాశవాణి కేంద్రం, సెబ్ కార్యాలయాలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జీఎస్టీ కార్యాలయాలు ఉన్నాయి. మార్కాపురం రైల్వేస్టేషన్ రోడ్, మెడికల్ కాలేజీ, జీజీహెచ్, వీటితో పాటు నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలు, ఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ తదితర విద్యా సంస్థలు కూడా ఉన్నాయి. జిల్లా కేంద్రం ఏర్పాటైతే వెనుకబడిన పశ్చిమ ప్రకాశం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

**అదనంగా ప్రత్యేక నిధులు**

మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటైతే కేంద్ర ప్రభుత్వం నుంచి వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి వచ్చే నిధులు మార్కాపురానికి వస్తాయి. దీని వలన

4

## మంత్రి చొరవతో మూడు గంటల్లోనే రైతు సమస్య పరిష్కారం

అన్నదాత అవస్థ చూసిన చలించిన మంత్రి గొట్టిపాటి రవి కుమార్

రైతన్నను ఆదుకోవాలని అధికారులకు ఆదేశాలు

మూడు గంటల్లోనే సమస్యను పరిష్కరించిన అధికారులు

మంత్రి గొట్టిపాటికి కృతజ్ఞతలు తెలిపిన రైతు



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జులై 9)

కడప జిల్లా ఖాజీపేట మండలం నాగసాని పల్లెలో అబ్బయ్య అనే రైతు పొలంలో విద్యుత్ తీగలు నేలను తాకుతుండేవి. గత కొంత కాలంగా రైతు తాను పడుతున్న ఇబ్బందులను పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లిన సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల వర్షాలు పడడంతో దుక్కి దున్నుకోవాలిని రైతు అబ్బయ్య భావించారు. ఈ క్రమంలో పొలంలో అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలను కుటుంబ సభ్యుల సాయంతో పట్టుకునేలా చూసుకున్నారు. అయితే దీనికి (తరువాయి 4లో...)

## నేనంటే నేను....

దయాలసిస్‌లో వైద్యుల రగడ

ఎమ్మెల్యే ఉగ్ర మద్దతు తమకేనంటున్న ఇద్దరు వైద్యులు

తలలు పట్టుకుంటున్న ఉన్నతాధికారులు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 9)

కనిగిరి దయాలసిస్ నందు ఇరువురు వైద్యుల రగడ తారాస్థాయికి చేరింది. ఇటీవల ఎమ్మెల్యే ఉగ్ర దయాలసిస్ సెంటర్ ను సందర్శించిన నేపథ్యంలో ఎంబీబిఎస్ డాక్టర్ బదులు ఆయుర్వేద డాక్టర్ విధులు నిర్వహించడం పట్ల ఆగ్రహించిన విషయం పాఠకులకు విధితమే. కాగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సదరు ఆయుర్వేద డాక్టర్ ను విధుల నుండి తొలగించి ఎంబీబిఎస్ డాక్టర్ ను సదరు నియమించింది. కాని మరలా ఏమైందో కాని మంగళవారం ఆయుర్వేద డాక్టర్ కూడా విధులకు హాజరయ్యారు. దీంతో పాత, కొత్త డాక్టర్ లు విధులకు హాజరయ్యారు. ఆయుర్వేద డాక్టర్ దయాలసిస్ పేషెంట్లకు నేనే మళ్ళీ విధుల్లోకి వచ్చానని, నేనే వైద్య సేవలందిస్తానని చెప్పడం గమనార్హం. కొత్తగా వచ్చిన ఎంబీబిఎస్ డాక్టర్ కూడా తాను లోకల్ అని , తనకు అన్ని అర్హతలు ఉన్నాయని మరోవైపు చెప్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా పేషెంట్లు మాత్రం అన్ని (తరువాయి 4లో...)

## ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలి

### కలెక్టర్ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 9)

ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వారితో సత్ప్రవర్తన కలిగి ఉండడం కూడా చాలా కీలకమని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. మంగళవారం ఆమె వైద్య శాఖలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులతో ప్రకాశం భవనంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు అందజేస్తున్న సేవలు, ఇందు కోసం విభాగాల వారీగా ఉన్న సిబ్బంది వివరాలపై ఆమె అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రులలో పారిశుధ్యము, సెక్యూరిటీ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యమూ ఉండరాదని ఆమె స్పష్టం చేశారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఆమె చెప్పారు. వైద్యులెవరైనా అనుమతి లేకుండా సెలవు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. రోగుల కోసం టాయిలెట్లు, తాగునీరు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో తీసుకున్న నిర్ణయాలు, ఇచ్చిన ఆదేశాలు కేవలం కాగితాలపైనే మిగిలిపోకుండా క్షేత్రస్థాయిలో అవి అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ఆయా విభాగాల ఉన్నతాధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉన్న సిబ్బందిని సమర్థంగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఇన్చార్జ్ డి.ఎం.హెచ్.ఓ జిల్లా క్షయ, కుష్టు, ఎయిడ్స్ విచారణ అధికారి సురేష్ కుమార్, డి.సి.హెచ్. ఎస్. శేషుకుమార్ డి.ఐ.ఓ. పద్మజ, ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు, డిప్యూటీ సూపరింటెండెంట్లు ప్రభాకర్ బాలాజీ నాయక్, మార్కాపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజమన్నార్, సూపరింటెండెంట్ సావిత్రి, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ హేమంత్, జిల్లా మలేరియా అధికారి మాధవీలత, డిప్యూటీ డి.ఎం. హెచ్.ఓ.లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**విద్యాశాఖ పైనా :** అనంతరం విద్యాశాఖపైనా కలెక్టర్ సమీక్షించారు. అకడమిక్, ఎస్టాబ్లిష్మెంట్ కార్యకలాపాలు, విద్యాలయాలలో చేపడుతున్న నిర్మాణాలు, ఇన్ క్లూజివ్ ఎడ్యుకేషన్ కార్యకాలాపాలతోపాటు వివిధ యాజమాన్యాల కింద ఉన్న పాఠశాలల వివరాలు, వాటిలోని (తరువాయి 4లో...)

# పురుగుల అన్నం... నీళ్ల చారు

గురుకుల పాఠశాలలో తాగునీటికి కటకట

గుత్తేదారుడు సరుకులు ఇవ్వలేదని సాకుతో

అమలు కానీ మెనూ

అర్ధాకలితో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ఇప్పటి వరకు చోద్యం చూసిన అధికారులు

సబ్ కలెక్టర్ రాకతో మారిన మెనూ



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 9)

అధికారులు వస్తున్నారని ముందస్తుగానే సమాచారం రావడంతో అప్పటికప్పుడు బాలికల గురుకుల పాఠశాలలో తాత్కాలికంగా బాలికలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసారు. బాలికల తల్లిదండ్రులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామంలో ఉన్నటువంటి కస్తూరుబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలకు సబ్ కలెక్టర్ వెళ్లి వివరాలు తెలుసు కున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అన్ని సౌకర్యాలతో ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.



**వాస్తవ పరిస్థితి ఇదీ**

మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామంలో కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో సౌకర్యాలు లేక బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో కనీసం బాలికలకు ఏర్పాటు చేస్తున్న మధ్యాహ్న భోజనం సక్రమంగా లేకపోవడం అన్నంలో పురుగులు రావడం నీళ్ల చారుతో సరిపెడుతున్న వైనం. మరుగుదొడ్లు కూడా సక్రమంగా లేకపోవడం. బాలికల కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ కూడా మరమ్మ తుల గురి కావడంతో బాలికలు (తరువాయి 4లో...)

# పురుగుల అన్నం... నీళ్ల చారు







తీవ్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. నీటి కోసం గురుకుల పాఠశాలలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించినా ఆ ఓవర్ హెడ్ ట్యాంకులో చుక్క నీరు కూడా చేరని వైనం దీంతో అది నిరుపయంగా మారింది. తాత్కాలికంగా బాలికలు వాడుకునే తొట్టిలో కూడా పాచి పట్టిన నీళ్లతోనే విద్య బాలికలు అవసరాలు తీర్చుకునే పరిస్థితి హాస్టల్లో నెలకొన్న పరిస్థితి. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో ముళ్ళ చెట్లు, చెత్తాచెదారం పెరిగి బాలికలు భయందోళనకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు ఈ హాస్టల్ వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో బాలికలకు సక్రమంగా సౌకర్యాలు కల్పించడంలో హాస్టల్ సిబ్బంది తీవ్రంగా నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఆరోపణలు బాలికలు తల్లిదండ్రులు తెలుపుతున్నారు. పాఠశాలలో చిల్లర కొట్టుకు అనుమతి లేకపోయినప్పటికీ ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతో అమ్మకాలు విక్రయిస్తున్నారు.

**మెనూ పాటించడం లేదు**

ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేసినప్పటికీ ఆ బాలికల పాఠశాలలో అన్ని అధ్వానంగా తయారయ్యాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న మేను కూడా సక్రమంగా అమలు కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాలికల గురుకుల పాఠశాలలో మొత్తం బాలికలు 640 మంది ఉన్నారు. వీరిలో 564 మంది విద్యను అభ్యసిస్తున్నారు. ప్రతిరోజు అమలు చేయాల్సిన మెనూను తుంగలో తొక్కేసినట్లు తెలుస్తోంది. పచ్చడి అన్నంతో సరిపెడుతున్నారు. పప్పు చారు... పచ్చడి అన్నము తిని రోగాల బారిన పడుతున్నారని బాలికల తల్లిదండ్రులు వాపోతున్నారు.

**సబ్ కలెక్టర్ రాహుల్ మీనా హాస్టల్ తనిఖీ**

మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా మంగళవారం మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో సక్రమంగా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని ఫిర్యాదు రావడంతో గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాత్కాలికంగా సబ్ కలెక్టర్ రావడంతో ముందస్తుగానే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దీంతో సబ్కా లెటర్ వెళ్ళగానే అన్ని సక్రమంగా ఉన్నాయని దీంతో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ప్రిన్సిపల్ కు హెచ్చరించారు. దీంతో సార్ వచ్చారు అన్ని మార్చారనే విమర్శలు బయట గుసగుసలాడుతున్నాయి. సబ్ కలెక్టర్ రాహుల్ మీనాతో పాటు ఎంపీడీవో తోట చందన తనిఖీలో పాల్గొన్నారు.

**బాలికలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం**


మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామంలో ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని బాలికల తల్లిదండ్రులు నమోదు ఇవ్వమంటున్నారు. దీనిపైన ప్రిన్సిపల్ టీ.ఏ. ఆశలతాను వెలుగు మార్కాపురం ఇన్చార్జి వివరణ కోరగా ఆమె బాలికలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని ఆమె వివరణ ఇచ్చింది. హాస్టల్లో బాలికలకు సొంత నిధులతో ఫిల్టర్ నీళ్లను కూడా సరఫరా చేస్తున్నామని వివరణ ఇచ్చారు.

# మార్కాపురం జిల్లా ఏర్పాటుతోనే.. పశ్చిమ ప్రాంత అభివృద్ధి



District Court Markapur, Andhra Pradesh

మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. కలెక్టర్ తోపాటు జాయింట్ కలెక్టర్, ఎస్పీ, వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, డీఆర్డీఏ, డ్వామా తదితర శాఖల ఉన్నతాధికారులు ఇక్కడే ఉండి అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలిస్తారు. ప్రస్తుతం జిల్లా కేంద్రమైన ఒంగోలుకు వెళ్లాలంటే పుల్లలచెరువు నుంచి ఒంగోలుకు 170 కిలోమీటర్లు, గిద్దలూరు నుంచి ఒంగోలుకు 150 కిలోమీటర్లు, దోర్నాల నుంచి ఒంగోలుకు 130 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుంది. వివిధ పనుల నిమిత్తం ప్రతిరోజూ ప్రజలు ఒంగోలుకు వెళ్లాలంటే అనేక వ్యయ ప్రయాసలకు




గురవుతున్నారు. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటైతే అధికార వికేంద్రీ కరణతోపాటు అభివృద్ధి కూడా త్వరగా జరిగే అవకాశం ఉంది.

**మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలి**
**మస్తాన్ వలి, విద్యార్థి, గిద్దలూరు**

పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల కోరిక అయిన మార్కాపురం జిల్లా ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరగా నిర్ణయం తీసుకోవాలి. ఎన్నికల ప్రచారంలో భాగంగా మార్కాపురం వచ్చినప్పుడు మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలో జరిగే క్యాబినెట్ సమావేశంలో తీర్మానం పెట్టి జిల్లా ఏర్పాటు చేయాలి.

**హామీ నిలబెట్టుకోవాలి**
**శ్రీనివాసులు, నిరుద్యోగి, మార్కాపురం**

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ నెలలో మార్కాపురం, పొదిలి వచ్చినప్పుడు ప్రజలకు మార్కాపురాన్ని జిల్లా చేస్తానని హామీ ఇచ్చారు. వెంటనే అమలు చేసి జిల్లాను ఏర్పాటు చేయాలి. దీనివలన కరువు ప్రాంతమైన పశ్చిమ ప్రకాశానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అదనంగా నిధులు వచ్చి మార్కాపురం అభివృద్ధి చెందుతుంది.



## మంత్రి చొరవతో మూడు గంటల్లోనే రైతు సమస్య పరిష్కారం

సంబంధించి ఫోటో ఏపీ విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కంటపడింది. రైతన్న ఇబ్బంది చూసిందే తడవుగా స్థానికంగా ఉండే అధికారులకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన అబ్బయ్య పొలంలో స్తంభం ఏర్పాటు చేశారు. ఏళ్ల తరబడి పరిష్కారం కానీ సమస్య మంత్రి ఆదేశాలు అందిన కేవలం మూడు గంటల్లోనే పరిష్కారమైంది. మంత్రి గొట్టిపాటి రవి కుమార్ చూపించిన చొరవను చూసి రైతన్న ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## నేనంటే నేను....

అర్హతలున్న ఎంబీబీఎస్ డాక్టరే ఉండాలని కోరుకోవడం గమనార్హం. పేషెంట్లకు ఎంబీబీఎస్ డాక్టరు ఉండాలన్న ఎమ్మెల్యే ఉగ్ర ఎవరివైపు మొగ్గుచూపుతాడో, లేక ఇద్దరిని కొనసాగిస్తారో వేచిచూడాలి. అయితే వీరిద్దరిలో ఎవరిని కొనసాగించాలో తెలియక సదరు నెప్రోప్లస్ సంస్థ ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు.

## ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలి



విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, తాగునీరు, పారిశుధ్యం, ప్రహరీగోడ, తదితర అంశాలకు సంబంధించిన వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. బడి వయస్సు పిల్లలందరూ బడిలో ఉండేలా చూడాలని, వారికి నాణ్యమైన విద్య అందించాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో డిఈఓ సుభద్ర, డిప్యూటీ విద్యాధికారులు అనితారోజ్ రాణి, చంద్ర మౌళీశ్వర్, ఏపిఈడబ్ల్యు ఐడిపి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు భాస్కర్ బాబు, సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నయ్య, గర్ల్ వైల్స్ డెవలప్ మెంట్ ఆఫీసర్ మాధవీలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్క షేడ్ నెట్ నర్సరీ లైసెన్సు కలిగి ఉండాలి

### ఉద్యాన శాఖ అధికారి పల్లకి ఆది రెడ్డి



**(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జులై 9)**

మండలంలోని సోమేపల్లి, వెల్లంపల్లి, శ్రీనివాస నగర్‌లోని షేడ్ నెట్ నర్సరీలను ఉద్యానవనశాఖ అధికారి పల్లకి ఆదిరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు నర్సరీ యాక్ట్ ప్రకారం ప్రతి ఒక్క షేడ్ నెట్ నర్సరీ తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకొని లైసెన్సు కలిగి ఉండాలని, లేనియెడల నర్సరీ ఆక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొత్తగా నర్సరీ మొదలు పెట్టిన వారు నర్సరీ యాక్ట్ ప్రకారం లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నర్సరీ యజమానులు మిరప విత్తనాలు అధీకృత డీలర్ల వద్ద మాత్రమే కొనాలని వాటికి తగిన బిల్లులు చూపించాలని, లేనియెడల కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నర్సరీ యజమానులు నర్సరీ యాక్ట్ ప్రకారం సీడ్స్ రిజిస్టర్, సేల్స్ రిజిస్టర్, ఇన్స్పెక్షన్ రిజిస్టర్, ప్లాంట్ ప్రొటెక్షన్ రిజిస్టర్ తప్పనిసరిగా మైంటైన్ చేయాలని ఆదేశించారు. ఈరోజు వెల్లంపల్లి, సోమేపల్లి మరియు శ్రీనివాస నగర్ లో కొత్తగా మొదలు పెట్టిన 20 కి పైగా నర్సరీలను తనిఖీ చేసి వారి కొన్న సీడ్ బిల్లులను తనిఖీ చేశారు. అలాగే రైతులు విత్తనం తెచ్చుకొని పోసుకున్న వివరాలను కూడా తనిఖీ చేశారు. ఉద్యాన శాఖ కమిషనర్ మరియు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా లోని ప్రతి ఒక్క నర్సరీ సందర్శించి లైసెన్సులను తనిఖీ చేసి ఇతర రిజిస్టర్లను తనిఖీ చేసి తగులు సూచనలు చేస్తున్నామని తెలిపారు. రైతు సోదరులు కూడా మిరప నారుకునేటప్పుడు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని లైసెన్సు ఉన్న నర్సరీలలో మాత్రమే నారు కొనుక్కోవాలని సూచించారు.

## మంత్రి లోకేష్‌ను కలిసిన ఎంపీ మాగుంట

**(షణ్ముక వెలుగు, ఒంగోలు, జులై 9)**



ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసంలో ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, యువ నాయకులు మాగుంట రాఘవరెడ్డి,



నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు కృష్ణదేవరాయలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం పలు విషయాలను వారు చర్చించుకున్నారు.

## మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన బొట్లా రామారావు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 9)**

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షులు వై ఎస్ జగన్ మోహన్ రెడ్డిని మంగళవారం ఉదయం తాడేపల్లిలోని ఆయన నివాసంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర బీసీ విభాగం జోన్ 5 ఇంచార్జి బొట్లా రామారావు కలిశారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లాలో వైఎస్సార్సీపీ కార్యకర్తలు, నాయకులపై అధికార తెలుగుదేశం వారు చేయుచున్న భౌతిక దాడులు గురించి పోలీస్‌లను ఉపయోగించి అక్రమ కేసులు బనాయించడం, వైఎస్సార్సీపీ నాయకుల ఆస్తులను కోర్ట్ ఉత్తర్వులను ధిక్కరించి పంచాయతీ రాజ్ డిపార్ట్మెంట్ అధికారులతో జేసీబీలతో ధ్వంసం చేస్తున్న విషయంను వై ఎస్ జగన్ మోహన్ రెడ్డికి తెలిపారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పందించి తెలుగుదేశం వారి అక్రమ కేసులను, దౌర్జన్యాలను ఎదుర్కోవడానికి పార్టీ తరపున సీనియర్ న్యాయవాదులను అందుబాటులో ఉంచామని, వెంటనే వారిని కలిసి దురాగతాలను వివరించి అక్రమ కేసులను ఎదుర్కొందామని, మితిమీరి వ్యవహరిస్తున్న పసుపు చొక్కాల అధికారులకు న్యాయస్థానాలు ద్వారా గుణపాఠం చెప్పుదామన్నారు. త్వరలోనే తెలుగుదేశం వారి విధ్వంసంలో ఆస్తులు నష్టపోయిన, మరణించిన, గాయపడిన, కుటుంబాలను పరామర్శించే కార్యక్రమం చేస్తామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి అండదండగా ఉంటుం దన్నారు.

# జాబ్ ఛార్టు ప్రకారం విధులు నిర్వర్తించాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 9)

ఆరోగ్యశాఖలో పని చేస్తున్న సిబ్బంది జాబ్ ఛార్టు ప్రకారం విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పై రివ్యు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు అనగా హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్ ప్రాథమిక, పట్టణ ఆరోగ్యకేంద్రాలు. సామజిక ఆరోగ్యకేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, సర్వజన ఆసుపత్రులు అన్నియు కూడా ప్రతి రోజు అన్ని రెజిస్టర్స్ , రికార్డ్స్ ను అన్ని వివరములతో పూర్తి చేసి నింపాలన్నారు. డాక్టర్ సురేష్ కుమార్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి జిల్లాలో అమలు అవుతున్న అన్ని జాతీయ కార్యక్రముల వివరములను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా గౌరవ కలెక్టర్‌కి వివరించడం జరిగింది. ప్రతి జాతీయ ఆరోగ్య కార్యక్రములకు సంబధించిన ప్రభుత్వము వారు కేటాయించిన లక్ష్యములను సకాలములో సాధించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం సంధించిన వాహనంలో అన్ని పరికరాలతో సదుపాయములతో గ్రామమునకు వెళ్లాలన్నారు. ఆ గ్రామమును సందర్శిచు తేదీ, వారమును ఆ గ్రామా ప్రజలకు తెలియచేయవలెను. ప్రభుత్వం వారు కేటాంచిన 14 రకముల టెస్టులను విధిగా చేయవలెను 104 మొబైల్ వాహనంలో అందించు సేవలను అన్నిటిని అందించాలన్నారు. టిబి, లెప్రసీ కార్యక్రమముల కింద ప్రజలలో చెతన్య పరుస్తూ అనుమానిత రోగులను సమీపములో ఆరోగ్యకేంద్రమునకు తగు పరీక్షలకు పంపవలెను. ఆరోగ్య శ్రీ ద్వారా లబ్ధి పొందిన వ్యక్తులను పరామశించి వారి వివరములను మొబైల్ యాప్ ద్వారా అప్లోడ్ చేయవలను. అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల వ్యాప్తి నివారణకు ఫాగింగ్ చేయవలెను. గ్రామములలో యమ్.యల్.హెచ్.పిల ద్వారా నీటి నమూనా పరీక్షలు జరిపి ఫలితములను వెంటనే పై అధికారులకు తెలియపరచవలెను. డి.సి.హెచ్.ఎస్. పరిధిలోని ఆసుపత్రిలో ప్రసుత్తము ఉన్న సిబ్బంది ఇంకను కావలసిన సిబ్బంది వివరములను వెంటనే కలెక్టర్‌కు తెలపాలని ఆదేశించినారు సదరన్ క్యాంపు తేదీల వివరములను ప్రజలకు ముందుగా తెలియపరచవలసినదిగా ఆదేశించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులందు విధిగా సార్ధరణ కాన్పులు విధిగా చేయాలని ఆదేశించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రము నందు ఏళ్ల వేళలా సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రులందు పరిశుభ్రత, సందర్శించు వారికీ తాగునీరు , అన్నిప్రదేశాలను పరిశ్రు భ్రముగా ఉండాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రము నాకు వచ్చు రోగులతో సానుకూలంగా వ్యవహరించి వారి సమస్యలను తెలుసుకుని వారికి అవసరమైన మందులు ఇచ్చి పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ప్రొగ్రామ్ అధికారులు, వైద్య కలశాల ప్రినిసిపాల్స్ డి.సి.హెచ్.ఎస్ సూపరింటిండెంట్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఇసుక విధానం అమలుకు జెండా ఊపిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 9)

సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలోని దొరవారిసత్రం మండలం పరిధిలోని ఇసుక స్టాక్ పాయింటును సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక వారు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నూతన ఇసుక విధానం 2024 అమల్లోకి తీసుకువచ్చి నామ మాత్రపు రుసుముతో ప్రజలకు ఇసుక అందుబాటులోకి తేవడం జరిగిందని, ప్రజలు వారి గృహ నిర్మాణానికి, ప్రభుత్వ భవనాలు నిర్మాణానికి వంటి వాటికి మాత్రమే వినియోగించుకోవాలని, ఇతర రాష్ట్రాలకు ఎలాంటి అక్రమ రవాణాకు తావు లేకుండా ప్రజలు వాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు, టీడీపీ నాయకులు, గనుల శాఖ అధికారి, ఆర్డిఓ చంద్రముని, నియోజకవర్గ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఆర్థిక సాయం




(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 9)

దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెల దివ్యాంగులకు సరుకులు పంపిణీ ఇస్తున్న విషయం గమనించి సిరిగిరీ రామకృష్ణ దాత ఫౌండేషన్‌కి రూ.5,000 నగదు ఇవ్వడం జరిగింది. సంఘం సభ్యులు అర్హులైన దివ్యాంగులను పరిశీలించి పొదిలి అడ్డ రోడ్డులో ఇటీవల కరెంట్ షాక్ కొట్టి రెండు చేతులు తీసివేయబడి నిస్సహాయతలో ఉన్న శివరయ్యని ఎన్నుకొని పొదిలి నగర పంచాయతీ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డిని అతిథిగా పిలిపించి దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ ప్రధాన కార్యాలయానికి పిలిపించారు. ఫౌండర్ బివి నరసింహారావు అధ్యక్షతన కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా దివ్యాంగుడికి రూ.5,000 చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫౌండేషన్ కార్యక్రమాలు ఎన్నో రోజుల నుంచి గమనిస్తున్నానని జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఎంతో కాలంగా దివ్యాంగులకు పేదలకు తన వంతు సహాయం చేయడం నాకు ప్రత్యేకంగా చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అంతేగాక ఫౌండేషన్ కార్యక్రమాల్ని గుర్తించి తన వంతు సాయంగా పొదిలి మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ఫౌండేషన్ ఫౌండేషన్‌కి ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమానికి మస్తాన్ భాష, శ్రీను, రాధా, ఆంజనేయులు, నరసింహారావు, బ్రహ్మ రెడ్డి, ధనలక్ష్మి, దుర్గ లక్ష్మి, అమ్ములు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌ను సన్మానించిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 9)

తిరుపతి జిల్లా నూతన కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌ను సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం సూళ్లూరుపేట నియోజకవర్గం అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, పెళ్లకూరు మండల టిడిపి అధ్యక్షులు సంచి కృష్ణయ్య,ఓజిలి మండల పార్టీ అధ్యక్షులు విజయకుమార్ నాయుడు, దొరవారి సత్రం మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు నాయుడు, టిడిపి నాయకులు నెలవల రాజేష్, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా నగరంలో ఏబీవీపీ శోభాయాత్ర








(షణ్ముక వెలుగు, ఒంగోలు, జులై 9)

అఖిలభారతి విద్యార్థి పరిషత్ ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏబీవీపీ 75 సంవత్సరాలు పూర్తి చేసుకుని 76వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నటువంటి సందర్భంగా ఒంగోలు నగరంలో ఉన్నటువంటి ఏకేవీకే కళాశాల నందు ఏకేవీకే కళాశాల ప్రిన్సిపల్ శ్రీ వెంకటేశ్వర రెడ్డిచే ఏబీవీపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏకేవీకే కాలేజీ నుంచి బస్టాండ్ మీదుగా పీవీఆర్ సెంటర్ వరకు విద్యార్థులతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అంకిరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద జాతీయభావాలు కలిగిన విద్యార్థి సంస్థ ఏబీవీపీ విద్యార్థుల్లో జాతీయ భావాలను పెంపొందిస్తూ విద్యార్థుల్ని దేశభక్తులుగా తయారు చేసే విధంగా కాలేజీ క్యాంపస్లో నిరంతరం పనిచేస్తుందని తెలియజేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఏబీవీపీ ఈ రోజు నిలబడిందంటే ఎంతోమంది ఏబీవీపీ కోసం పని చేసినటువంటి వారి యొక్క త్యాగాలను గుర్తుచేసుకొని వారు కొనియాడడం జరిగింది .అదేవిధంగా దేశాన్ని ముందుకు నడిపించే నాయకత్వంలోనూ ఏబీవీపీ తనదైన ముద్రణ వేసుకొని ఈరోజు దేశాన్ని ముందుకు నడపగలరా శక్తిని కలిగిన నాయకులను దేశానికి అందించిన ఘనత ఏబీవీపీకే దక్కిందని వారు కొనియాడారు. దేశం కోసం జీవించాలి దేశం కోసం మరణించాలి అనే నినాదాన్ని ప్రతి విద్యార్థిలో ప్రతి యువకుడిలో నింపే విధంగా పనిచేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్, రామకోటి రెడ్డి, గురునాథ్, అయ్యప్ప, ఆదిల్, మస్తాన్, సామ్యూల్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# తగిన విద్యుత్ సిబ్బందిని ఏర్పాటు చేయండి

### విద్యుత్ శాఖ ఎస్ఈకి వినతి పత్రం అందజేసిన టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 9)

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని సబ్ స్టేషన్ లలో తగిన విద్యుత్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని టీడీపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని అనేక సబ్ స్టేషన్ లలో అసిస్టెంట్ లైన్‌మెన్‌లు, జూనియర్ లైన్‌మెన్ ల కొరత ఎక్కువగా ఉందని, దీంతో గ్రామాల్లో విద్యుత్ సేవల్లో లోపాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. తగిన విద్యుత్ సిబ్బందిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ములుమూడి సర్పంచ్ కుండా. కరుణాకర్, మండల కొఆప్షన్ మెంబర్ మీరా మొహిద్దిన్, టిడిపి నాయకులు అరవ శ్రీను, అట్ల నరసయ్య, సోడం భాస్కర్, అబ్దుల్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.

# కాపీ రైటింగ్ పుస్తకాలను పంపిణీ చేసిన యశ్వంత్ ఎడ్యుకేషన్ సొసైటీ



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 9)

మండలంలోని పొదిలికొండ పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కాపీ రైటింగ్ పుస్తకాలను పాఠశాల ఉపాధ్యాయులు, యశ్వంత్ ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య పంపిణీ చేశారు. తన సొంత నిధుల నుంచి ఖర్చు చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం రామ సుబ్బారెడ్డికి మంగళవారం అందజేయగా వాటిని పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా దాత డాక్టర్ మొర్రి పిచ్చయ్య మాట్లాడుతూ విద్యార్థులు కాపీ రైటింగ్ పుస్తకాలను సద్వినియోగ పరుచుకుని బాగా చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.రామ సుబ్బారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని దాతను అభినందించగా, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# నెల్లూరు జిల్లా వైసీపీ బడా నేతలు, చోటా నేతల గుండెల్లో రైళ్లు

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 9)

నెల్లూరు జిల్లా క్వార్ట్జ్ అక్రమాలపై, క్వార్ట్జ్ స్మగ్లింగ్ పై నిజమైన మైనింగ్ ఓనర్లను బెదిరించి, కోట్లాది రూపాయల అక్రమ వసూళ్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కన్నెర్ర చేసారు. నిన్నటి రోజు అమరావతిలో దీనిపై మైనింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం జరిపి, వారి పూర్తి వివరాలు, అక్రమ మైనింగ్ డబ్బుతో కొనుగోలు చేసిన ఆస్తులపై పూర్తి సమాచారం రాబట్టాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో మాజీ ముఖ్యమంత్రికి కుడి భుజంగా పనిచేసిన ఓ వైసీపీ బడానేత , నెల్లూరు జిల్లాలో వైసీపీలోని నెల్లూరు జిల్లా స్థాయి కీలకనేత , నెల్లూరు జిల్లాలో రాజకీయ పైరావీకారుడిగా పేరుగాంచిన ఓ వైకాపా చోటా నేత మెడకు ఉచ్చు చుట్టుకోబోతుంది. వీళ్లు త్వరలో కటకటాల వెనక్కి వెళ్ళబోతున్నారని పరిశీలకుల అంచనా. దీనిపై ఇప్పటికే కొంతమంది వైసీపీ బాధితులైన వ్యాపారస్తులు సిఐడికి ఫిర్యాదు చేశారు.

# పీజీ ఫలితాల్లో శ్రీహర్షిణి విద్యార్థి యూనివర్సిటీ ఫస్ట్






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 9)
ఫిబ్రవరి 2024 ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం నిర్వహించిన పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలు సోమవారం విడుదల చేశారు. అందులో శ్రీహర్షిణి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ విద్యార్థులు యూనివర్సిటీ మొదటి ర్యాంక్ సాధించి విజయ దుందుభి మోగించారు. అందులో ఎంఎస్‌సి కంప్యూటర్ సైన్స్ 70 మంది విద్యార్థులు హాజరుకాగా 64 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అందులో కటారి యామిని 700 మార్కులకు గాను 634 మార్కులు సాధించి యూనివర్సిటీ మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీ హర్షిత 628 మార్కులతో రెండవ స్థానాన్ని, కే గౌతమి 621 మార్కులతో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.ఎమ్ ఎస్ సి కెమిస్ట్రీలో 56 మంది విద్యార్థులు హాజరుకాగా 50 మంది ఉత్తీర్ణత సాధించినారు. అందులో చెరుకూరి మహిత 650 మార్కులకు గాను 566 మార్కులతో యూనివర్సిటీ మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జి భావన 552 మార్కులతో రెండవ స్థానాన్ని, కే హేమ 546 మార్కులతో తృతీయ స్థానాన్ని సాధించారు. ఎం ఎస్ సి మ్యాథమెటిక్స్ 38 మంది విద్యార్థులు హాజరుకాగా 30 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినారు. అందులో గుండ్రెడ్డి స్వప్న 600 మార్కులకు గాను 483 మార్కులతో యూనివర్సిటీ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. రెండవ స్థానాన్ని జి.పుష్పలత 480 మార్కులతో, మూడవ స్థానాన్ని టీ సంపత్ కుమార్ 472 మార్కులతో కైవసం చేసుకున్నారు. మరియు ఎమ్ ఎస్ సి ఫిజిక్స్‌లో యూనివర్సిటీ స్థాయిలో కేవలం ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించగా అందులో ఇద్దరు విద్యార్థులు శ్రీహర్షిణి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ వారు కావడం గర్వకారణం.

## విద్యార్థికి సూర్యశ్రీ ట్రస్ట్ ఆర్థిక సాయం



(షణ్మక వెలుగు, ఒంగోలు, జులై 9)
పేర్నమిట్టకు చెందిన అబ్దుల్ గఫూర్ తల్లిదండ్రులు చనిపోయి వృద్ధురాలు నాయనమ్మ అయిన మహబూబి దగ్గర పెరుగుతున్న షేక్ అబ్దుల్ గఫూర్ సంతనగర్‌లోని సాయి కాన్వెంట్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. చదువులో మంచి ప్రతిభ చూపిస్తున్నాడు. కానీ స్కూల్ ఫీజు, పుస్తకాలు కొనే ఆర్థిక స్తోమత లేక సూర్యా శ్రీ ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్ భాషకి సంప్రదించారు. స్పందించిన ఆయన ప్రావాస భారతీయుడు దాత కుర్ర అనిల్ కుమార్‌తో మాట్లాడి అబ్దుల్లా స్కూల్ ఫీజు మరియు పుస్తకాల నిమిత్తం రూ.15,000 ట్రస్టు కార్యాలయం నందు చైర్మన్ సయ్యద్ షహనాజ్ సర్దార్ భాషా చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సెక్రెటరీ సర్దార్ మాట్లాడుతూ అబ్దుల్ గఫూర్ భవిష్యత్తులో బాగా చదువుకుంటే తన విద్యకు తప్పకుండా ట్రస్ట్ తరఫున సాయం చేస్తా అని మాట ఇచ్చారు.

## పదేళ్ల నుంచి సాధ్యం కాని పని నేడు సాధ్యమైంది

### మార్కాపురం ఎమ్మెల్యే కందులకు కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు



(షణ్మక వెలుగు, పొదిలి, జులై 9)
పొదిలి నగర పంచాయతీలోని ఫుల్లర్‌పేటలోని ఓ ప్రాంతానికి పది సంవత్సరాల నుండి కేవలం స్థంబాలు ఉన్నాయ్ కానీ విద్యుత్ లైన్ లేదు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆ ప్రాంతానికి వచ్చిన మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి స్థానికులు విషయం తెలిపారు. గెలిచిన వెంటనే పని చేస్తా అని కందుల నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు పొదిలి మండలం టీడీపీ అధ్యక్షులు మీగడ ఓబులరెడ్డి, పట్టణ అధ్యక్షులు ముల్లా ఖుద్దుస్‌లకు ఫుల్లర్ పేటలో ఉన్న సమస్య వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే కందుల ఆదేశాలతో మీగడ ఓబులరెడ్డి, ముల్లా ఖుద్దుస్ కలసి విద్యుత్‌శాఖ వారిని సంప్రదించి పదేళ్లుగా లేని విద్యుత్ లైన్ దగ్గరుండి మంగళవారం వేయించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మీగడ ఓబులరెడ్డి, ముల్లా ఖుద్దుస్‌లకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మీగడ ఓబురెడ్డి, ముల్లా ఖుద్దుస్ మాట్లాడుతూ ఇంత చిన్న పని పదేళ్లుగా పరిష్కారం కాకపోవడం శోచనియమని అన్నారు. అంతేకాకుండా ప్రజలకు ఏ సమస్య ఉన్నా కూడ తమ నాయకుడు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు.

## ఎంఎంఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

### సంతనూతలపాడు ఎంఈఓ వెంకారెడ్డి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 9)
విద్యార్థులకు, వృద్ధులకు అవసరమైన సేవలు అందిస్తూ ఎంఎంఆర్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని, ఫౌండేషన్ ప్రతినిధి థామస్ సేవా నిరతికి ఇది నిదర్శనమని సంతనూతలపాడు మండల విద్యాశాఖ అధికారి వెంకారెడ్డి పేర్కొన్నారు. పేర్నమిట్ట శాంతినగర్‌లో డాక్టర్ నూకతోటి రవికుమార్ నేతృత్వంలో నిర్వహిస్తున్న అంబేద్కర్ స్టడీ సర్కిల్ ట్యూషన్ సెంటర్లో మక్కెన, రోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు మంగళవారం ఉచిత నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ రవి కుమార్ అధ్యక్షత వహించగా జరిగిన సభలో వెంకా రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఫౌండేషన్ చైర్మన్ మక్కెన థామస్ మాట్లాడుతూ వృద్ధులకు, వికలాంగులకు, విద్యార్థులకు అవసరమైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే ప్రమాద బారిన పడిన వారికి తక్షణం రక్తదానం చేస్తూ ఫౌండేషన్ విశేషంగా కృషి చేస్తున్నదని అన్నారు. తన తల్లిదండ్రుల పేరు మీద చేస్తున్న ఈ కృషి సార్థకం అవుతున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. రైస్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ రాజ్ కిరణ్ మాట్లాడుతూ మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి భవిష్యత్తును పొంది తల్లిదండ్రులకు సంతోషం కలుగజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైక్వాండో అధ్యాపకుడు కోమల శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు కైలా విజయ్ తదితరులు పాల్గొని ప్రసంగించగా 40 మందికి పైగా విద్యార్థులకు ఫౌండేషన్ ద్వారా అతిథులు నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య

### ఆర్జెడి లింగేశ్వరరెడ్డి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 9)
ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని గుంటూరు జోన్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి లింగేశ్వరరెడ్డి అన్నారు. కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ పర్యవేక్షకుల శిక్షణ కార్యక్రమాలను ఆయన మంగళవారం పరిశీలించారు. పది రోజుల శిక్షణ కార్యక్రమాలలో నేర్చుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో విద్యార్థులకు బోధనలో భాగంగా అందించాలని ఆయన సూచించారు.. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు సమగ్ర బోధనా విధానాలను ఉపాధ్యాయులు ఆచరించాలని ఆర్జెడి కోరారు. ఈ విద్యా సంవత్సరంలో టీచ్ టూల్ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చి తరగతి గదుల్లో అమలు చేయడం జరుగుతుందని అన్నారు. బడిబైట ఉన్న పిల్లలందరినీ పాఠశాలలో చేర్చడం ఉపాధ్యాయులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. నూరు శాతం నమోదు లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను పాఠశాలల్లో అమలు చేస్తుందన్నారు. దీనికిగాను నెలరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు.స్టూడెంట్ కిట్స్ ని విద్యార్థులకు అందించాలన్నారు. ఏకరూప దుస్తులు, నోటు పుస్తకాలు బూట్లు బ్యాగులు బెల్టులు తదితర సామగ్రిని అన్ని పాఠశాలలకు ఇప్పటికే చేర్పించడం జరిగిందని అన్నారు. విద్యాప్రదేశ్ కార్యక్రమాలను పాఠశాలల్లో కచ్చితంగా అమలు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో ఉపాధ్యాయులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్జెడి లింగేశ్వరరెడ్డి వెంట మండల విద్యాశాఖ అధికారులు రాజుల కొండారెడ్డి, జి సంజీవి, యువి నారాయణరెడ్డి ఉన్నారు.



## బీజేపీని బూత్‌స్థాయి వరకు తీసుకు వెళ్లాలి




(షణ్ముఖ వెలుగు, రాజమండ్రి, జులై 9)
రాజమహేంద్రవరంలో బిజెపి రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం సోమవారం రాజమహేంద్రవరం మంజీర హోటల్లో జరిగింది. రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ - పార్లమెంట్ ఎన్నికలు, అనంతరం బిజెపి విజయానికి సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు అభినందనలతో శుభాకాంక్షలు తెలిపారు. సంస్థగతంగా పార్టీని బలోపేతం చేస్తూ, పార్టీని బూత్‌స్థాయి వరకు తీసుకుని వెళ్లాలని, జలజీవన్ పథకం ద్వారా గ్రామాలలో ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు, ఆవాజ్ యోజన పథకం ద్వారా పేద ప్రజలకు గృహాలు నిర్మించాలని, జాతీయ రహదారులు నిర్మించి అభివృద్ధి చేయాలని తీర్మానం చేశారు. భారత న్యాయ వ్యవస్థలో ప్రవేశపెట్టిన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎన్ఏ మూడు కొత్త చట్టాలను గురించి సుధీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రులు మురుగన్, భూపతి రాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్య కుమార్, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధీశ్వరీ, జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్, జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాధరాజు, రాష్ట్రనికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగిచారు. ఈ సమావేశానికి దాదాపు 2500 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ప్రకాశం జిల్లా నుండి జిల్లా బిజెపి అధ్యక్షులు శివారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి , మార్కాపురం నియోజకవర్గం బిజెపి బాధ్యులు పీవీ కృష్ణారావు, కొనకనమిట్ల మండల బిజెపి అధ్యక్షులు శ్రీనివాసరావు, తదితరులు హాజరయ్యారు.

## సాంఘిక సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి సహకరించాలి

### మంత్రి డోలాకు విన్నవించిన టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, జులై 9)
యర్రగొండపాలెం నియోజకవర్గ సాంఘిక సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి సహకరించాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు కోరారు. నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ, గురుకుల వసతి గృహల అభివృద్ధి, నూతన భవన నిర్మాణాలు, అడ్మిషన్లను పెంచాలని మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. అమరావతి సచివాలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామిని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామికి యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, గిరిజన వసతి గృహాలకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లు, అదనపు భవన నిర్మాణాలు అలాగే విద్యార్థుల అడ్మిషన్ సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా యర్రగొండపాలెం పట్టణం లో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర మరియు బాలికల వసితి గృహాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై తక్షణమే సహాయం చేయాలని విజ్ఞప్తి చేసారు. ఎరిక్షన్ బాబు వినతిని మంత్రి స్వామి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు.

# డయూరేయా పై అప్రమత్తంగా ఉండాలి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 9)

ఒంగోలు నగరపాలక సంస్థలో కమీషనర్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సదరు సమీక్షలో అసిస్టెంట్ కమీషనరు జస్వంత్ కుమార్ , మున్సిపల్ హెల్త్ ఆఫీసరు, శానిటరీ సూపర్ వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ అండ్ ఇన్విరాన్మెంట్ సెక్రటర్స్ సిబ్బంది హాజరయ్యారు. సమీక్షలో సీజనల్ డిసీజ్ అయిన డయేరియా, మలేరియా, డెంగీ, ఇతర సాంక్రమిక వ్యాధులు, డిసెల్టేషన్ 120 మైక్రాన్ లోపల ఉన్నటువంటి సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్, వాటర్ సప్లయి మొదలగు విషయములు గురించి సూచనలు, అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా ప్రచారం ద్వారా నగర ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని చిల్లర, టోకు, వాణిజ్య వ్యాపార సంస్థల వారికి 120 మైక్రాన్స్‌పై బడిన నాణ్యత గల ప్రత్యమ్నాయ ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్ లు మాత్రమే అనుమతి ఉన్నందున 120 మైక్రాన్ లోపల నాణ్యత గల క్యారీ బ్యాగ్స్ లను నిషేదించబడినందున, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్ విక్రయించు, నిల్వవుంచు, తయారుచేయు షాపు యజమానులకు అపరాద రుసుమును విధించబడునని తెలియజేయాలని ఆదేశించారు. ఒంగోలు నగరపాలక సంస్థ 50 వార్డులలో నిర్మించబడిన వర్షదారపు కాలువలు, మధ్యస్థ కాలువలు, చిన్న కాలువలు, మట్టి కాలువలను గుర్తించి పారిశుధ్య సిబ్బందితో ఎప్పటికప్పుడు మట్టి, ఇతర వ్యర్ధములను బయటకు తీయించి కంపోస్టు యార్డుకు తరలించి, అన్ని ప్రాంతములలో బ్లీచింగు, సున్నము కలిపి



మురికి ప్రాంతాల్లో వెదజల్లి ఎలాంటి అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని పారిశుధ్య విభాగపు సిబ్బందికి ఆదేశించారు. నగర పరిధిలో గల అన్ని వార్డులలో బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి నిల్వ ఉన్న చెత్త, ఇతర వ్యర్ధములను శుభ్రపరచి ఆ స్థానంలో మరల చెత్త సంబంధిత వ్యర్ధములను పడవేయకుండా ప్రతి దినము పర్యవేక్షణ ద్వారా నిలుపుదల చేయాలని ఆదేశించారు. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో గల 70 సచివాలయముల శానిటేషన్ అండ్ ఇన్విరాన్మెంటల్ సెక్రటరీలు విధి నిర్వహణలో భాగంగా ఉదయం 5.30 గంటలకు, మధ్యాహ్నం 2.00 గంటలకు మస్టరు హాజరు కావలయునని, పారిశుధ్యము పనిలో భాగంగా వీధులను శుభ్రపరుచుట, కల్వర్టులు, పెద్ద, చిన్న, మట్టి కాలువలను యుద్ధ ప్రాతిపదిక పై గ్యాంగ్ వర్కు చేపట్టి మట్టి , వ్యర్ధములను వెలుపలకు తీయించి మురుగు నీరు శుభ్రముగా పారునట్లు చేసి, మురుగు ప్రాంతాలలో సున్నము, బ్లీచింగ్ కలిపి చల్లింవలసినదిగా పారిశుధ్యపు సెక్రటరీలను ఆదేశించారు. అనంతరం సీజనల్ వ్యాధులైన డయేరియా, మలేరియా, డెంగీ, ఇతర సాంక్రామిక వ్యాధులను ఏఎన్ఎం ద్వారా ఇంటింటికి సర్వేలను నిర్వహించి వ్యాధులను నిర్ధారణ చేసుకొని సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు రాత పూర్వకంగా తెలియజేసి ముందు జాగ్రత చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. సదరు సర్వే రిపోర్టును సంబంధిత గౌరవ డిస్ట్రిక్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్, ప్రకాశం, ఒంగోలు వారికి రాత పూర్వకంగా చర్య నిమిత్తం తెలియజేయాలని ఆదేశించారు. అనంతరం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ యాప్ ను ఇన్స్ స్టాల్ చేసుకొని బ్లాక్‌స్పాట్స్, పైప్‌లైన్ లీకేజీ, పైప్‌లైన్ క్రాసింగ్, ఓవర్ డ్రైన్స్, డిసెల్టేషన్ ఆఫ్ డ్రైన్స్‌ను తక్షణమే పరిష్కారించిన సమస్యలను యాప్‌లో గ్రీవెన్స్ రిజిష్టరు చేయాలని ఆదేశించారు. పైన తెలిపిన విషయంలో ఎలాంటి అశ్రద్ధ వహించినచో ఎలాంటి తాఖీదు జారీచేయకుండానే సిబ్బందిపై క్రమశిక్షణ చర్య తీసుకుంటామని హెచ్చరించారు.

# రైతులు సబ్సిడీపై విత్తనాలను నమోదు చేసుకోవాలి

## వ్యవసాయశాఖ అధికారి వి బాలకృష్ణ నాయక్



(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, జులై 9)

మండలంలోని వ్యవసాయశాఖలో సబ్సిడీపై విత్తనాలు కలవని దర్శి మండల వ్యవసాయ అధికారి వి.బాలకృష్ణ నాయక్ తెలిపారు. దర్శి మండలంలోని రైతులు ప్రతి గ్రామంలో ఉన్న రైతు సేవ కేంద్రాలకు వెళ్లి గ్రామ వ్యవసాయ సహాయకుల సహాయంతో సబ్సిడీపై విత్తనాలు బుకింగ్ చేసుకోవాలని తెలియజేస్తూ కంది - ఎల్ ఆర్ జి - 52 రకం కేజీ విత్తనం పూర్తి ఖరీదు 139.80 గాను రైతు కట్టవలసినది 97.86 రూపాయలు అని వరి విత్తనాలు ఒక కేజీ 41.80 రూపాయలకు గాను ఒక కేజీకి 5 రూపాయలు చొప్పున సబ్సిడీ కలదని తెలియజేశారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులందరూ ఉపయోగించుకోవాలని అయన తెలియజేసినారు.

# ముండ్లమూరు ఎస్ఐగా నాగమల్లేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, జులై 9)

ముండ్లమూరు మండలం నూతన ఎస్ఐగా వి నాగమల్లేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు మహిళా పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ బదిలీపై ముండ్లమూరు వచ్చారు. ముండ్లమూరులో పనిచేస్తున్న ఆంజనేయులు సెలవుపై వెళ్లారు.

# బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించవద్దు



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జులై 9)

మండల పరిధిలోని బహిరంగ ప్రదేశాలలో మద్యపానం చేసేవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శివ నాగరాజు హెచ్చరించారు. వైన్ షాపుల సమీపంలో రోడ్ల పైన బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై అలాగే ప్రదేశాలపై నిఘా ఉంటుందని తెలిపారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం చేయిస్తే కేసులు నమో చేసి అరెస్టు చేస్తామని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో జూదం కోడి పందాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# పండ్ల తోట సాగుకు దరఖాస్తు స్వీకరణ



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జులై 9)

మండలంలో పండ్ల తోటల సాగుకు ఆసక్తి కలిగిన వ్యక్తులకు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో లలిత కుమారి తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఆసక్తి కలిగిన సన్న కారు చిన్న కారు రైతులు దానిమ్మ,నిమ్మ,మామిడి,జామ, మునగ అవసరమైన రైతులకు పాస్ పుస్తకం, వన్ బి , అడంగల్ జెరాక్సులు తీసుకొని సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి సూచించారు.

# వ్యర్థాల నుంచి సంపదను సృష్టించాలి





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 9)

జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తెలిపినట్లుగా వ్యర్థాల నుంచి సంపదను సృష్టించడం ఎలా అనే మార్గాలను అన్వేషిస్తూ నెల్లూరులోని అల్లీపురం వద్ద గల డంపింగ్ యార్డ్‌ను, దొంతాలిలో అటవీ ప్రాంతంలో ఉన్న 20 ఎకరాల డంపింగ్ యార్డును జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పరిశీలించారు. చెత్తను సేకరిస్తూ , సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో , దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్న వ్యక్తులు తమ భద్రతకు సరైన మాస్కులు, చేతులకు - కాళ్లకు గ్లౌజులు వేసుకుని ఆరోగ్యానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకుని పనిచేసుకుంటూ డిగ్నిటీ ఆఫ్ లేబర్‌గా జీవించేందుకు, అదే విధంగా నిరుద్యోగ యువత చెత్తను రీసైక్లింగ్ చేసి ఎరువులుగా మార్చేందుకు , ఘన వ్యర్థాలను శుద్ధి చేసి మళ్ళీ వినియోగించే ప్రక్రియ, శుద్ధి ప్లాంట్ల నిర్మాణంపై దృష్టిపెట్టాలని , "చెత్త నుంచి సంపద" సృష్టించాలని అన్నారు .ఇందుకోసం ఒక ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల ప్రజలకు కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా డంప్‌యార్డు నిర్వహణ కూడా సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు.అదే విధంగా సీపీసీబీ నిబంధనలను పాటిస్తూ సహజ వాతావరణంలోకి లేదా భూముల్లో పేరుకుపోయిన సేకరించని ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేయడానికి ఒక ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్లాంట్ల విషయమై మున్సిపల్ కార్పొరేషన్ శాఖ మంత్రి పొంగూరు నారాయణతో , నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తో చర్చించేందుకు సాధ్యాసాధ్యాలను గునుకుల కిషోర్ పరిశీలించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా... జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చాలా చోట్ల ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను నిర్మించారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, ఆ చెత్త ద్వారా సంపద సృష్టించే లక్ష్యంతో నిర్మించి పంచాయతీలకు అప్పగించారు. తడి, పొడి చెత్త నిర్వహణ, సేంద్రియ ఎరువులు తయారు చేసి రైతులకు అందుబాటు ధరలో అందించాలనేది వీటి ముఖ్య ఉద్దేశం.అయితే వీటిని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దాని వల్ల అవి నిరూపయోగంగా మారాయి. ఇలా చాలా చోట్ల అవి ఖాళీగా ఉండటంతో అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి , వీటిని మళ్ళీ పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురావాలని ఆయన కోరారు.

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి 2019-20 వార్షిక నివేదిక ప్రకారం భారత్‌లో రోజుకు సుమారు 1.5 లక్షల టన్నుల మున్సిపల్ ఘనవ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వాటిలో 47శాతమే శుద్ధికి నోచుకుంటున్నాయి. 27శాతాన్ని భూమిలో కప్పెడుతున్నారు. మిగతా 26శాతం దారి తప్పుతోందని పరిశీలనలు చెబుతున్నాయి. స్వచ్ఛ భారత్ మిషన్ 2.0లో భాగంగా వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి అన్ని నగరాల్లోని డంపింగ్ యార్డుల్లో పోగుపడిన చెత్త దిబ్బలను శుద్ధి చేయాలని సంకల్పించిన మన ప్రధాని నరేంద్ర మోడీ గారి ఆశయ సాధనలో మన ప్రభుత్వం కూడా పాలుపంచుకుని భూగర్భ జలాలు, ఉపరితల నీటి వనరులు కలుషితం కాకుండా పర్యావరణాన్ని కాపాడాలని కోరుకుంటున్నానని అన్నారు.

# పంట సాగుదారుల చట్టంపై ప్రచార ఉద్యమం

(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, జులై 9)

దళిత బహుజన రిసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కృష్ణాపురం, కొర్లమడుగు, త్రిపురసుందరిపురం, పోతవరం, శామంతిపూడి గ్రామాలలో దళిత బహుజన రిసోర్షన్ ఆధ్వర్యంలో పంట సాగుదారుల చట్టంపై ప్రచార ఉద్యమం దర్శి నియోజకవర్గ కన్వీనర్ గుంటూరు నాగమణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మన రాష్ట్రంలో 32 లక్షలకు పైగా కౌలు రైతులు వ్యవసాయంపై ఆధారపడి కుటుంబాన్ని పోషించటం ఇష్టమైన ఈ కాలంలో కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది అని వారికి బ్యాంకు నుండి పంట రుణాలు పంట బీమా వివిధ సబ్సిడీలు పథకాలు పొందలేకపోతున్నారని ఆమె అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రైతు ఆత్మహత్యలు 75% అంటే మూడు వంతులు కౌలు రైతులవే కాబట్టి కనీసం కౌలు రైతులందరూ ప్రభుత్వం నుంచి ఒక గుర్తింపు పొందాల్సిన అవసరం ఉందని పంట సాగుదారుల హక్కుల చట్టం 2019 అక్టోబర్ రెండో తేదీ నుంచి ఈ కొత్త చట్టం అమలు జరుగుతుంది కాబట్టి భూ యజమానులు మీరు నిశ్చింతగా ఉండి కౌలు రైతులకు ఒప్పంద పత్రాలపై సంతకాలు పెట్టి వారికి కూడా ప్రభుత్వ పథకాలు అందించేలా మీ వంతు కృషి చేయాలని కౌలు రైతుకు ఒప్పంద కాలం గరిష్టంగా 11 నెలలకు మాత్రమే కనుక వారికి భూమి మీద ఏ హక్కు ఉండదు కాబట్టి మీరు నిశ్చింతగా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయాలని కౌలు కార్డు పొందే విధానం భూ యజమాని లీజు తారు ఒప్పందంపై సంతకం చేయాలని మా పొలాన్ని కౌలుకిస్తున్నట్లు వీడియో లింకేజీ డిజిటల్ మీడియా ద్వారా తమ అంగీకారం తెలిపిన సరిపోతుందన్నారు. తమకు అందిన ఒప్పంద పత్రంపై వీఆర్ఓ కౌంటర్ సంతకం చేయాల్సి ఉంటుందని ఒప్పంద ప్రక్రియను రెవెన్యూ అధికారులు పరిశీలన అనంతరం గ్రామ సచివాలయంలో మూడు రోజులలోపు రికార్డులు నమోదు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వ పథకాలైన పంట బీమా ఇన్పుట్ సబ్సిడీ కో-ఆపరేటివ్ బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చు అని ఆమె తెలిపారు. భూ యజమానులతో పాటు రైతు భరోసా ద్వారా లబ్ధి పొందుటకు ఎస్సీ, ఎస్టీ ,బీసీ , మైనార్టీ కి చెందిన కౌలు రైతులు కూడా అర్హులని ఆమె అన్నారు. భూ యజమాను నిశ్చింతగా సహకరించవచ్చని ఆమె తెలిపారు. ఈ క్యాంపియన్ లో మండలలోని ఐదు గ్రామాలలో పంట సాగుదారుల చట్టంపై ప్రచార ఉద్యమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐదు గ్రామాలలోని తెలుగు మహిళా రైతులు పాల్గొన్నారు.





# జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ శ్రీశైలం పాదయాత్ర





(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, జులై 9)

మండల కేంద్రంలోని కడప జిల్లా రైల్వే కోడూర్ జనసేన ఎమ్మెల్యే మంగళవారం నాడు దోర్నాల శ్రీశైలం వెళ్లే రోడ్డు మార్గంలో అయ్యప్ప స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకుని శ్రీశైల మహా క్షేత్రమునకు పాదయాత్రగా బయలుదేరారు. ఎన్డీఏ కూటమి విజయకేతనం ఎగరవేయడంతో శ్రీశైల మల్లికార్జున స్వామి మొక్కులలో భాగంగా ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భముగా దోర్నాల తెలుగుదేశం పార్టీ ,జనసేన పార్టీ నాయకులు ఆయనకు సంఘీభావం ప్రకటించి ఆయనతో జనసేన నాయకులు పాదయాత్ర కొనసాగించారు. ఈ పాదయాత్రలో జనసేన మండల కన్వీనర్ కేతి వెంకట మురళి, చింతగుంట్ల మల్లికార్జున,కమ్మ వెంకటేశ్వర్లు (పెద్ద పండు), కేతి ఆంజనేయులు, అరవ శ్రీధర్ మిత్రబృందం, టిడిపి నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి,రావిక్రింది సుబ్బరత్నం, కొప్పుల వెంకటసుబ్బారెడ్డి, చంటి, రామిరెడ్డి, తంగిరాల చెన్నారెడ్డి, షేక్ మంజూరు, కడిమెట్ల శ్రీనివాస్ యాదవ్, జనసేన పార్టీ నాయకులు దాసయ్య, గుర్రాల ప్రసాద్, కమ్మ వెంకటనారాయణ (చిన్న పండు), తదితర నాయకులు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు.

# డిజిపిని కలిసిన ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జి



(షణ్ముఖ వెలుగు, అమరావతి, జులై 9)

మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో మంగళవారం డిజిపి ద్వారకా తిరుమలరావు ను ప్రకాశం జిల్లా ఒంగోలు, గిద్దలూరు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్‌రావు, ముత్తుముల అశోక్‌రెడ్డితో పాటు యర్రగొంధపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలు వారు ఆయనతో ముచ్చటించారు.

# మాతృ మరణాలు జరక్కుండా చర్యలు చేపట్టాలి

### జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సురేష్ కుమార్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 9)

మాతృమరణాలు జరగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఛాంబర్‌లో మాతృమరణముల సబ్ కమిటీ పై రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాతృ మరణములు జరగకుండా చూడాలని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రముల వైద్య సిబ్బందిని ఆదేశించారు. సకాలంలో గర్భిణీ స్త్రీలను నమోదు చేసి వారికీ అందించు సేవలను సకాలంలో అందించాలన్నారు. అన్ని వివరాలను ఆర్.సి.హెచ్. యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రమాద సంకేతము గల గర్భిణీలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి వారి బర్త్ ప్లాన్‌ను తయారు చేయాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం వారికీ అందించు సేవలను వైద్యాధికారి పరివేక్షణలో అందించాలన్నారు. అత్యవసర సేవల అయిన గర్భిణీ స్త్రీలను ఆషా, ఎఎన్ఎం సమీపములో ఏరియా ఆసుపత్రికి గాని సర్వజన ఆసుపత్రికిగాని లేదా యంసిహెచ్ ఆసుపత్రికి గాని సకాలంలో 108 వాహనం ద్వారా తరలించాలన్నారు. ఆసుపత్రిలో సంబంధిత గర్భకోశ నిపుణలద్వారా గర్భిణీ స్త్రీకి అన్ని సేవలు అందించు విధముగా చూడాలన్నారు. అందరు గర్భిణీ స్త్రీ లను ప్రతి నెల 10వ తేదీ జరిగే ప్రధానమంత్రి మాతృ వందన యువజన కార్యక్రమానికి తీసుకుని వచ్చి వారికీ అక్కడ అవసరమైన అన్ని వైద్య పరీక్షలు, స్కాన్ చేయించి వివరములను గర్భిణీ స్త్రీకి వారి కుటుంబ సభ్యులకు తెలియపరచి ఆమె పౌష్టిక ఆహారము సక్రమముగా తీసుకునేలా పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రంలో డాక్టర్ పద్మజ డిఐఓ, వైద్యాధికారులు, సర్వజన ఆసుపత్రి ప్రసూతి విభాగపు హెడ్, మత్తు మందు విభాగం హెడ్, ప్రవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు, దొనకొండ, చెట్లమిట్ట, పుల్లచెరువు వైద్యాధికారులు, వారి సిబ్బంది, డిపిహెచ్ఎన్ఓ సుగుణమ్మ, ఉప మాస్ మీడియా అధికారి సరోజినీ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని కలిసిన కనగాల





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 9)

ఆంధ్రప్రదేశ్ ఎన్డిఏ కూటమి విజయం సాధించిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కనగాల మధు నాయకత్వంలో చేపట్టిన గుంటూరు టూ తిరుమల కాలినడక యాత్ర నెల్లూరు చేరుకుంది. కనగాల మధు ఆధ్వర్యంలో పాదయాత్రలో టిడిపి కార్యకర్తలు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని నెల్లూరులోని విపిఆర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. గుంటూరు నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టిన టిడిపి నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అభినందించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్షేమంగా తిరుమల చేరుకుని మొక్కు చెల్లించుకోవలసిందిగా కోరారు.

# ఎమ్మెల్యే కందులను పరామర్శించిన మంత్రి నారాయణ





(షణ్ముఖ వెలుగు, హైదరాబాద్, జులై 9)

హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని మంగళవారం హాస్పిటల్లో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా కందుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో కుశల ప్రశ్నలు వేశారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# పెరుగుతున్న ధరల నియంత్రణకై చర్యలు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 9)

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలన్న రాష్ట్ర ప్రభుత్వ విధానంలో భాగంగా ప్రకాశం జిల్లాలో తీసుకోవాల్సిన చర్యలు గురించి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్లోని మీకోసం సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. వివిధ సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులు బియ్యం, కందిపప్పు, మిల్లుల యజమానులు , వ్యాపారస్తులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ జాయింట్ కలెక్టర్ బియ్యం, కందిపప్పు అమ్మడానికి నగరంలోని మూడు రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని అటువంటి కౌంటర్ల నుంచి మంచి నాణ్యమైన బీపీటీ బియ్యం, స్టీమ్ చేసినవి కిలో 49 రూపాయలకే పచ్చి బియ్యం కిలో 48 రూపాయలకి అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అదేవిధంగా కందిపప్పు కూడా కిలో 160 రూపాయలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కౌంటర్ల ఏర్పాటు కోసం వివిధ రైతు బజార్లను సందర్శించిన జాయింట్ కలెక్టర్ రైతు బజార్ల మౌలిక సదుపాయాలు పట్ల అసంతృప్తి వ్యక్తపరిచారు. రైతు బజార్లలో పారిశుద్ధ్యం, టాయిలెట్ల నిర్వహణ మరింత మెరుగుపడాలన్నారు. మంచినీటి సౌకర్యానికి లోటు ఉండకూడదని రైతు బజార్లోకి వెళ్లే వచ్చే దారులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు. అదేవిధంగా కంది పంట విషయంలో జిల్లా వ్యవసాయ అధికారులు మరింత కృషి చేసి విస్తీర్ణాన్ని పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్ఓ ఉదయభాస్కర్ సివిల్ సప్లై డీఎం సత్యనారాయణ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# డయేరియా అరికట్టడంలో చిత్తశుద్ధితో పనిచేయాలి

### మున్సిపల్ కమిషనర్ టివి రంగారావు





(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 9)

డయేరియా అరికట్టుటలో మెప్మా రిసోర్స్ పర్సన్స్‌లు చిత్తశుద్ధితో పనిచేయవలెనని మున్సిపల్ కమిషనర్ టివి రంగారావు అన్నారు. ఈ నెల 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్టాప్ డయేరియా(అతిసార నియంత్రణ) కార్యక్రమంలో భాగంగా మంగళవారం కనిగిరి పురపాలక సంఘం కార్యాలయంలో మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు, మెప్మా సిబ్బందితో అవగాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున నీరు కలుషితమై సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా నీరు కాచి చల్లార్చి తాగాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రజలు బహిరంగ మల విసర్జన చేయకుండా మరుగుదొడ్లను వినియోగించాలన్నారు. అతిసారను అరికట్టడంపై ఆర్పీలు ప్రతిరోజూ వార్డులలో అవగాహనా ర్యాలీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కనిగిరి పట్టణం సుందరీకరణకు త్వరలో ప్రతి ఇంటికి మొక్కలు అందజేస్తామని, అందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు వివరించాలని తెలిపారు. ఈ సమావేశంలో మెప్మా సీఎంఎం రఘు, సివో సురత్న కుమారి, సిఎల్ఆర్ దీప్తి, పట్టణ సమాఖ్య కార్యదర్శి ఐ.రాధమ్మ, ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలతో మమేకమై పనిచేయాలి

### ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

### ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించాలి

### యల్లాయపాలెం సచివాలయం పరిశీలన, ఫిర్యాదులు స్వీకరించిన ఎమ్మెల్యే

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 9)

గ్రామీణ ప్రజావసరాలు తీర్చడంలో సచివాలయాలు కీలక పాత్ర పోషించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరు ఎమ్మెల్యేగా తన విజయంలో కీలక పాత్ర వహించిన కొడవలూరు మండలం యల్లాయపాలెం గ్రామస్థులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళవారం యల్లాయపాలెం గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఆమె.. అనంతరం సచివాలయ సిబ్బంది ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్న తీరును పర్యవేక్షించారు. పెండింగ్లో ఉన్న సమస్యలపై అధికారులతో సమీక్ష జరిపారు. ప్రజలతో మమేకమై పని చేయాలని, పారిశుధ్యం, వ్యవసాయం, సాంఘీక సంక్షేమ తదితర విభాగాలకు చెందిన సచివాలయ కార్యదర్శులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం యల్లాయపాలెం నాయకులు మరియు గ్రామస్థులతో సమావేశమయ్యారు. పెన్షన్లు,





ఇళ్ళ పట్టాలు, స్థానికంగా రోడ్లు, డ్రైన్లు తదితర స్థానిక సమస్యలకు సంబంధించి విజ్ఞప్తులు స్వీకరించారు. తాగునీటి సమస్యకు సంబంధించి విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఆర్ ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు. అనంతరం యల్లాయపాలెం హై స్కూల్‌ను సందర్శించి ఉపాధ్యాయులతో విద్యా సంబంధ విషయాలపై చర్చించారు. విద్యార్థినీ, విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో కొడవలూరు ఎంపిడిఓ ప్రద్యుమ్న రావు, టిడిపి మండల అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, బెజవాడ వంశీధర్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, స్థానిక నేతలు వెంకట్రామి రెడ్డి, వంశి, భూలోక విజయ, బుడుగు శ్రీనివాసులు జనసేన శూలం బాబు తదితరులు పాల్గొన్నారు.

# 10న ఆత్మకూరు నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం

(షణ్ముఖ వెలుగు, ఆత్మకూరు, జులై 9)

ఆత్మకూరు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఈ నెల 10వ తేదీన ఉదయం 11 గంటలకు శ్రీధర్ గార్డెన్స్, ఆత్మకూరు నందు జరుగుతుందని మేకపాటి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఆనం అరుణమ్మ, బీదా మస్తాన్‌రావు, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మానుగుంట మహీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్, మహమ్మద్ ఖలీల్ అహ్మద్, మేరిగ మురళీధర్, తూమాటి మాధవరావు, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డిలు పాల్గొంటారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీ పరిధిలోని వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మండల కన్వీనర్లు, జేసీయస్ కన్వీనర్లు, మాజీ సొసైటీ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ వైస్ చైర్మన్, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ అనుబంధ విభాగాల కార్యవర్గ సభ్యులు, సోషల్ మీడియా సోదరులు, ఇతర ముఖ్య నాయకులు తప్పక హాజరు కావాలని కోరారు.

# విత్తన దుకాణాలను తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 9)

పట్టణంలోని విత్తన దుకాణాల్లో మంగళవారం ఉప వ్యవసాయ సంచాలకులు జి లక్ష్మణ్ కుమార్, తిరుపతి విజిలెన్స్ సిఐ ఎస్ చంద్రశేఖర్ లు స్థానిక వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులుతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుకాణ యజమానులు జిల్లా పరిధిలో విత్తనాల అమ్మకాలు జరిపే విధంగా లైసెన్సును కలిగి ఉన్నారు. కానీ కొంత మేర విత్తనాల అమ్మకాలను ఇతర జిల్లాలకు అమ్మడం జరిగిందని గమనించారు. వారికి తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేయడం జరిగిందని వారు తెలిపారు. విత్తన, పురుగు మందుల కేంద్ర దుకాణాల యజమానులు ఎప్పటికప్పుడు వారి వద్ద ఉన్న ఎరువులు, విత్తనాల, వివరాల స్టాక్ బోర్డ్ నిర్వహణ సక్రమంగా ఉండాలని, ప్రభుత్వ అనుమతి కలిగిన నాణ్యమైన విత్తనాలను, ఎరువులను రైతులకు అమ్మాలని, అమ్మకపు వివరాలను రికార్డ్ నందు పొందు పరిచి, ఆ రైతులకు రసీదులు ఇవ్వాలని ఆయన తెలిపారు. అలా లేని యెడల వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మార్కాపురం ఒంగోలు టెక్నికల్ ఏఓ శ్రీనివాస నాయక్, మార్కాపురం, తర్లుపాడు ఏఓలు దేవిరెడ్డి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అఖిల భారత విద్యార్థి పరిషత్

### ఆవిర్భావ దినోత్సవం శోభయాత్ర




(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 9)

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయుడుపేట శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం 76వ ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారీ సంఖ్యలో 1500 విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తిరుపతి జిల్లా కన్వీనర్ సన్నీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 76 సంవత్సరాలుగా ఈ దేశం కోసం విద్యార్థుల కోసం పని చేసే ఒకే ఒక్క విద్యార్థి సంఘం ఎబివిపి అని కేవలం ధర్నాలు మాత్రమే కాకుండా సేవ కార్యక్రమాలు కూడా చేస్తూ విద్యార్థులలో దేశభక్తి భావాలు నింపుతుందని వారు అన్నారు. అనంతరం భారీ సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుడుకు చందు మాట్లాడుతూ ఢిల్లీలో యూనివర్సిటీలో ఓం ప్రకాష్ ప్రొఫెసర్ కేవలం నలుగురితో చాట్ చేసిన ఉద్యమం ఇప్పుడు ఈ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థుల సంఘం ఏదైనా ఉందంటే అది కేవలం అఖిల భారత విద్యార్థి పరిషత్ మాత్రమేనన్నారు. అంతేగాక ఈ విద్యార్థి పరిషత్ లో పనిచేసిన కార్యకర్తలు ఎంతో గొప్ప స్థాయిలో ఉన్నారు. ఈ రాష్ట్రంలో భారత్ మాతాకీ జై నినాదం పలికే విద్యార్థి సంఘం ఏదైనా ఉందంటే అది ఏబీవీపీ మాత్రమేనన్నారు. అదేవిధంగా వందేమాతరం అని నినాదించే విద్యార్థి సంఘం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఈ రాష్ట్రంలోనే కాదు ఈ దేశంలోనే అతిపెద్ద విద్యార్థుల సంఘం ఏదైనా ఉందా అంటే అది ఖచ్చితంగా అఖిల భారత విద్యార్థి పరిషత్ మాత్రమే నేను కచ్చితంగా చెప్తా మన్నారు. మళ్ళీ మళ్ళీ చెప్తా ఈ దేశం కోసం పని చేస్తున్నటువంటి విద్యార్థి సంఘం ఏదైనా ఉందంటే అది కచ్చితంగా అఖిల భారతి విద్యార్థి పరిషత్ మాత్రమేనన్నారు. విద్యకి అండ విద్యార్థికి అండ జైఎబివిపి ఆవిర్భావ దినోత్సవ, జాతీయ విద్యార్థి దినోత్సవ శుభాకాంక్షలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర్ కార్యదర్శి తిరుపతి జిల్లా ఎస్ ఎఫ్ డి కన్వీనర్ హరి నారాయణ, సహాయ నగర్ కార్యదర్శి వినయ్, భరత్, ప్రణయ్, బాలాజీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# ఎంఎడ్ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో గోరంట్ల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 9)

ఉమ్మడి ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోని పెళ్ళూరు కాలనీలో ఒకటిన్నర సంవత్సరం క్రితం నూతనంగా ఏర్పాటు చేయబడిన ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయం పరిధిలో పరీక్షలు రాసిన విద్యార్థులకు సంబంధించిన ఫలితాలు ఒక్కొక్కటిగా విడుదల అవుతున్నాయి. తాజాగా పి.జి.మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను ఆంధ్ర కేసరి యూనివర్శిటీ అధికారులు ఇటీవలే విడుదల చేసారు. ఈ ఫలితాలలో ఎం.ఎడ్ విభాగంలో ఆంధ్ర కేసరి యూనివర్శిటీ పరిధిలో ఉన్న మొత్తం 9 ఎం.ఎడ్ కళాశాలల నుంచి 182 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 65 శాతం ఉత్తీర్ణతతో మొత్తం 118 మంది విద్యార్థులు పాసైనారు. వీరిలో ఒంగోలు నగరం లోని మహేంద్ర నగర్ లో ఉన్న జి.వి.అండ్ ఏ.డి.ఎస్.ఎల్. విద్యా బోధనా కళాశాల నుంచి మొత్తం 27 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 27 మంది విద్యార్థులు పాసు కావడంతో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అయింది. నూతనంగా యూనివర్శిటీ ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే ఎం.ఎడ్ విభాగం నందు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల గోరంట్ల విద్యా బోధనా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.వీర నారాయణ బాబు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వీర నారాయణ బాబు తోబాటు ఎం.ఎడ్ విభాగం ఇన్చార్జి కొత్తూరు. బలరాం, బి.ఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.ప్రసాద రావు తదితరులు హృదయ పూర్వకంగా అభినందించారు. అదే విధంగా తమ కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు కృషి చేసిన కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని సైతం గోరంట్ల విద్యా బోధనా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.వీర నారాయణ బాబు అభినందించారు. అంతేగాక భవిష్యత్ లో కూడా తమ విద్యా బోధనా కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు వీలుగా ప్రధానాచార్యునితో పాటు బోధన, బోధనేతర సిబ్బంది శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఆయన సూచించారు.

# ఉచిత ఇసుకను ప్రారంభించిన ఎమ్మెల్యే

## కురుగొండ్ల రామకృష్ణ



(షణ్ముఖ వెలుగు, వేంకటగిరి ఇన్‌ఛార్జి, జులై 9)

తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గం శివారు ప్రాంతంలో ఉచిత ఇసుక రీచ్‌ను స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మంగళవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో ఇసుక మాఫియా రాజ్యమేలిందని, జగన్ ప్రభుత్వం కోట్లాది రూపాయలు దోచుకుందని ఆయన మండిపడ్డారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన నెల రోజులలో ఇచ్చిన మాట ప్రకారం ఇసుక సరఫరా మొదలు కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. లోపల ఉచిత ఇసుక విధానం తీసుకు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రతి పేద వాడి సొంతింటి కల నెరవేరబోతుందని ఆయన తెలిపారు.

# డెంగీ వ్యాధులపై ప్రజలకు అవగాహన డాక్టర్ యం యాగ్నిక్



(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, జులై 9)

మండలంలోని పెద్ద బొమ్మలాపురం గ్రామంలో చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రము వైద్యాధికారి డాక్టర్ యం.యాగ్నిక్ ఆధ్వర్యంలో స్టాప్ డయేరియా, డెంగీ మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో భాగంగా బొమ్మలాపురం గ్రామంలోని ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, అనంతరం గ్రామములో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ యం యాగ్నిక్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు తెలుసుకోవాల్సిన విషయాలు వాతావరణంలో మార్పు వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. డయేరియా సోకకుండా నీటిని గోరువెచ్చగా వేడి చేసి చల్లార్చిన తరువాత తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటిలో నిలువ ఉన్న ఆహార పదార్థాలను తినరాదు, చేతులు పరిశుభ్రంగా కడుకోవలని, మన ఇంటి చుట్టుపక్కల నీటి గుంతలు గాని, మురుగనీరుగాని, ఉన్నట్లయితే దోమలు ఎక్కువగా ప్రబలయ్యే సూచనలు ఉంటాయి. ఆ నీటి గుంతలను మనం శుభ్రం చేసుకుంటే మనకు ఎలాంటి వ్యాధులు రావని గ్రామ ప్రజలకు సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌యన్, పి సూర్యకుమారి, సబ్ యూనిట్ ఆఫీసర్ సిహెచ్ రమేష్ బాబు, సూపర్వైజర్లు కె సత్యనారాయణరెడ్డి, కె పద్మావతి ఎయన్‌యం, యస్‌డి భాను, సిహెచ్‌ఓ, షేక్ మీరా వలి, హెల్త్ అసిస్టెంట్, ఏ భరత్ భూషణ్, 104 సిబ్బంది చాంద్ భాష, ఆశా కార్యకర్తలు ఎ కాశీ ఈశ్వరి, యం లక్ష్మీ దేవి, డి కాశమ్మ, యం పవిత్ర, హుసేన్‌బీలు, తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచులు పై కక్ష సాధింపులకు పోవద్దు

## ప్రభుత్వానికి జి వీరభద్రాచారి విజ్ఞప్తి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 9)

నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం సర్పంచులు పై కక్ష సాధింపు చర్యలు దిశగా అడుగులు వేయవద్దని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీర భద్రాచారి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పంచాయితీలకు వ్యతిరేకంగా చేపట్టిన అనేక దోపిడీ విధానాలకు సర్పంచులు వ్యతిరేకించి కూటమికి సహకరించా రన్నారు. పార్టీ రహిత ఎన్నికలలో సర్పంచులుగా గెలిచిన వారు ప్రజాప్రయోజనాలు, గ్రామాల అభివృద్ధికోసం అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నారన్నారు. వైసిపి ప్రభుత్వ విధానాలకు విసిగి, వేసారిన సర్పంచులు చంద్రబాబు పంచాయితీల ప్రయోజనాలకు ఇచ్చిన హామీ మేరకు కూటమివైపు మొగ్గు చూపారన్నారు. ఈ విషయాన్ని కూటమి లోని తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల నాయకత్వాలు గుర్తించి మెలగాలని వీరభద్రాచారి తెలిపారు. ఉపాధి హామీ తదితర పనులు,చేసిన బిల్లుల చెల్లింపు విషయంలో అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయితీరాజ్, స్థానిక సంస్థల అంశాలపై త్వరలో మంత్రి పవన్ కళ్యాణ్‌ను కలసి వివరించనున్నట్లు వీర భద్రాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బి శ్రీరామ మూర్తి, మన్నం శ్రీనివాస్, బి రాము యాదవ్, తదితరులు పాల్గొన్నారు.




# రైతు బజార్‌ను తనిఖీ చేసిన జెసి గోపాలకృష్ణ







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 9)





ఒంగోలు నగరంలోని రైతు బజార్‌ను మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ సందర్శించి పారిశుద్ధ్య ఏర్పాట్లను, రైతు బజార్ నిర్వహణ పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ జశ్వంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# నిత్యం మురుగు వాసన పట్టించుకోని గత ప్రభుత్వం ప్రజల అవస్థలు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 9)

ఒంగోలు భాగ్యనగర్ 4వలైన్‌లో రోడ్డు అధ్వానంగా మారింది. గుంతలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం భాగ్యనగర్ నుండి హౌసింగ్ బోర్డు వరకు ఎన్నో వాహనాలు తిరుగుతుంటాయి. స్కూల్‌కు వెళ్లే పిల్లలు ప్రయాణిస్తూ ఉంటారు. కాలువలు పొంగి మురుగు నీరు రోడ్డుపై చేరి నడుచుకుంటే వెళ్లే విద్యార్థులు, మురుగు వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్డు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటి కైన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ భాగ్యనగర్ రోడ్ పై దృష్టి పెట్టాలని, స్థానిక ప్రజలు కోరుతున్నారు. అలాగే గద్దలగుంట మూడు బొమ్మలు సెంటర్ లో రోడ్ పరిస్థితి కూడా గుంతలతో ఇబ్బంది పడుతున్నారని స్థానికులు తెలిపారు.



